దీపావళి శుభాకాంక్షలు

# ప్రభాత సమాచారం

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

https: epaper. prabhatha samacharam.com

సోమవారం

20 అక్టోబర్ 2025

15 పేజీలు








# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్


## మధ్యతరగతికి ధరల మోత..!



వెలుగుల పండుగ దీపావళి వచ్చేసింది.. టపాసుల మోతలు, చిచ్చుబుడ్ల మెరుపులు, తారాజువ్వల కాంతులతో పిల్లలు, పెద్దలు ఆనందించే సమయం.. పిల్లలు బాంబులు కాలుస్తూ హడావిడి చేస్తారు.. వ్యాపారులు కూడా పిల్లలను ఆకర్షించేందుకు కొత్త రకాల టపాసులను అందుబాటులోకి తెచ్చారు.. మధ్యతరగతి, పేద కుటుంబాల వారు టపాసులు కొనుగోలు చేయాలంటే జేబులు తడుముకోవాల్సిందే.. ఈ ఏడాది టపాసుల ధరలు 10నుంచి 15శాతం పెరిగాయి.. ఇక ఇంట్లో చిన్న పిల్లలు ఉన్న మధ్యతరగతి కుటుంబాల వారు రూ.వెయ్యి నుంచి 2వేల రూపాయల వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారత పురాణ ఇతిహాసాల్లోను, వేద వేదాంగాల్లోనూ దీపానికి ఉత్కృష్టమైన స్థానం ఉంది. హైందవ సంస్కృతిలోనే కాక ఇతర మతాల్లోనూ 'దీపం' పరబ్రహ్మ స్వరూపమని భావిస్తూ ఆరాధిస్తారు.. ఇదే భారతీయులలో ఉన్న గొప్ప శక్తి.. 'దీప్యతే అనేన దీప': ఇత్యమర: ప్రకాశింపజేయబడునది. అంటే జ్ఞాన వెలుగుల్ని ప్రసాదించేది దీపం. అజ్ఞానానికి చిహ్నమైన మనస్సును నశింపజేసి జీవులకు వెలుగు మార్గాన్ని చూపించేదే దీపం పరబ్రహ్మమైనది. చీకటిని పారదోలుతుంది. ఈ దీపం వల్లనే సర్వకార్యాలు సిద్ధిస్తాయని ప్రశస్తి.




భారతీయ సంస్కృతికి అద్దం పట్టే పండుగల్లో దీపావళి ఒకటి.. ఈ పండుగ సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు నరక చతుర్దశిని, ఆశ్వయుజ బహుళ అమావాస్య లక్ష్మీ పూజలను, బలిపాడ్యమి వేడుకలను జరుపుకోనున్నారు. కొత్తగా పెళ్లైన అల్లుళ్లు అత్తింటికొచ్చి, దీపావళి వేడుకల్లో పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది.. ఆశ్వయుజ బహుళ చతుర్దశిని నరక చతుర్దశిగాను, అమావాస్యను దీపావళి పుణ్యదినంగాను, పాడ్యమిని బలిపాడ్యమిగాను జరుపుకుంటారు.. అమావాస్య రోజు మహాలక్ష్మీ కుబేరపూజ చేసి, రాక్షసుల బాధలు తొలగిన ఆనందాన్ని వ్యక్తం చేసేందుకు దీపాలంకరణ చేస్తారని, బాణాసంచా కాలుస్తారని ప్రతీతీ.. ఏ ఇంటిముందు దీపాలు దేదీప్యమానంగా వెలుగుతాయో ఆ ఇంట మహాలక్ష్మీ ప్రవేశిస్తుందని రుగ్వేదం చెబుతోంది.. జ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. చీకట్లను పారద్రోలి జీవితాల్లో కాంతులు వెదజల్లే పండుగ దీపావళి.. దీపకాంతులు, బాణాసంచా మోతలతో అమావాస్య చీకట్లలో వెలుగులు విరజిమ్మే వేడుక దపావళి. ధనలక్ష్మిని ప్రత్యేకంగా కొలిచే పవిత్రదినం.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పర్వదినం.. ఓ సినీ కవి అన్నట్లు.. 'చీకటి వెలుగుల రంగేలీ.. జీవితమే ఒక దీపావళి' కావాలని ఆకాంక్షిస్తోంది మీ 'ప్రభాతసమాచారం'




## మరో 5 రోజులు ఛాన్స్

■ 'లిక్కర్' దరఖాస్తుల గడువు పెంపు ■ 23 దాకా దరఖాస్తు చేసుకోవచ్చన్న

■ ఎక్సైజ్ శాఖ బంపరాఫర్ ■ బీసీ బంద్, వరుస సెలవులే కారణం..

లిక్కర్ షాపుల దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. బీసీ బంద్, బ్యాంకుల బంద్ల కారణంగా దరఖాస్తులు సమర్పించలేకపోయిన ఉత్సాహకులు విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని గడువు పొడిగించినట్లు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ తెలిపారు. మద్యం షాపుల లైసెన్సుల కోసం దరఖాస్తులను ఈనెల 23వ తేదీ వరకు స్వీకరించనున్నారు. ఇంతకు ముందు ఈనెల 23న కలెక్టర్ల సమక్షంలో జరగాల్సిన డ్రా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన డ్రాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా డ్రా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

## ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ దాడులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అంతరాష్ట్ర చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ సోదాలను అధికారులు చేశారు. ఈ దాడుల్లో భోరజ్ చెక్పోస్టులో రూ.1.26 లక్షలు, బైంసా చెక్ పోస్టులో రూ.3 వేలు, కుమురంభీం జిల్లా వాంకిడి చెక్పోస్టులలో రూ.5,100లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ చెక్ పోస్టలలో లెక్కలోలేని నగదు గుర్తించి స్వాధీనపరచుకున్నట్లు పేర్కొన్నారు.







## పండుగ పూట విషాదం

■ రెండు కుటుంబాల్లో చీకట్లు

■ రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

■ మరొకరికి తీవ్రగాయాలు..

■ బైక్ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు

■ వంజీరి, బెండార గ్రామాల్లో విషాదం

■ అందరిని కంటతడిపెట్టించిన బాధిత కుటుంబ సభ్యుల రోదనలు..

■ న్యాయం చేయాలని ఆందోళన..

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. దీపావళి పండుగ వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సమయంలో 'కారు' చీకట్లోకి నెట్టింది. రహదారి ప్రమాదం రూపంలో ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కుమ్రంభీం జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఆసిఫాబాద్ మండలం మోతుగూడ వద్ద జాతీయ రహదారిపై కారు.. బైక్ను ఢీకొట్టిన ఘటనలో వాంకిడి మండలం బెండారం గ్రామానికి చెందిన జగన్ (27), అనసూయ(32), ప్రజ్ఞశీల్ (4) మృతి చెందారు.



## దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

■ ఆదివాసీ గూడేల్లో దండారి ఉత్సవాలు

■ సాంప్రదాయ వస్త్రాలతో గుస్సాడీ నృత్యాలు చేసి ఆకట్టుకున్న ఎమ్మెల్యే బొజ్జు

## ఆదివాసీ సాంస్కృతిని భావితరాలకు అందించాలి

■ ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

■ ఇంద్రవెల్లిలో దండారి ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ





## ఇద్దరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు..?

**బోథ్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
బోథ్ అటవీ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు పడినట్లు మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. సోనాల మండలంలోని ఘన్పూర్ చెక్ పోస్ట్ వద్ద విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఓ బీట్ ఆఫీసర్ ను, మరో బీట్ అధికారి కూడా తరచూ విధులకు గైర్హాజరు అవుతుండడంతో ఇద్దరిపై ఉన్నతాధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకున్నట్లు మండలంలో పలువురు మాట్లాడుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఈ విషయంపై అటవీ శాఖ అధికారి ప్రణయ్ ను వివరణ అడగగా ఆర్డర్ కాపీ ఏమీ రాలేదు అని, పూర్తి వివరాలు తెలుసుకుని చెబుతానన్నారు. ఏది ఏమైనా ఇద్దరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు వేశారని మండలంలో పుకార్లు వెలువడడంతో ఈ విషయం పై జిల్లా ఉన్నతాధికారులే స్పందించి వాస్తవాన్ని తెలుపాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## మద్యం దుకాణాలకు లక్కీ డ్రా ఎప్పుడంటే?

**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
కొత్త మద్యం దుకాణాలకు ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిన్న దరఖాస్తుల గడువు ముగిసే సేపు 32 వైన్స్ షాపులకు 602 టెండర్లు వచ్చాయని చెప్పారు. ప్రభుత్వం టెండర్ల స్వీకరణకు ఈ నెల 23 వరకు గడువు పొడిగించినప్పటికీ ఆదివారం, సోమవారం దీపావళి సెలవు కావడంతో మరో మూడు రోజులే అవకాశం కల్పించినట్లు అయింది.

## ఘనంగా దండారి ఉత్సవాలు



**ఉట్నూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసి గూడాలలో కన్నుల పండుగ దండారి ఉత్సవాలు జరుగుతున్నాయి. దండారిలో చిన్నారులు, యువకులు, గుస్సాడిల నృత్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఆదివారం మండల కేంద్రంలో పాత ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన దండారిలో రాజాంపేట, తుక్కుగూడ, కల్లూరు గూడ, దుర్గాపూర్ దండారిలు పాల్గొన్నాయి. దండారిలో కోలాటం ప్రత్యేక ఆకర్షణలో నిలిచింది. దండారిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నృత్యాలను తిలకించారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

**సారంగాపూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మండల పరిధిలో పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పైన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఐదుగురికి జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపిన మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాల ఇవ్వదని, పిల్లలు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆయన తెలిపారు.

# టపాసుల ధరల మోత.. విక్రయాల ఇష్టారాజ్యం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దీపావళి పండుగ పూట మార్కెట్లో టపాసుల ధరల మోత మోగుతోంది. దుకాణాల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా టపాసుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ధరలను నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో సామాన్య జనాలపై భారం పడుతుంది. దీంతో సామాన్య ప్రజలు మార్కెట్లో టపాసుల కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా ఉంది. జిల్లాలో ప్రతి ఏటా సుమారు 4 కోట్ల పై టపాసుల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. గత ఏడాది దీపావళి పేలుడు పదార్థాల పై 23 శాతం జీఎస్టీ ఉండగా ఈ ఏడాది 18 శాతానికి తగ్గింది. టపాసుల తయారీ వాడే కెమికల్స్ ధరలు కూడా చాలా తగ్గినా.. మార్కెట్లో టపాసుల ధరలు మాత్రం వ్యాపారులు తగ్గించడం లేదు. భూ చక్రం బాక్స్ తో పాటు చిచ్చుబుడ్ల రకాలను ఏరియాలను బట్టి రూ 30 నుంచి 200. 50 నుంచి 300 వరకు ధరలు ఉన్నాయి. ఇక 1000 వాలా బాక్స్ రూ 300 కాగా 5000 వాలా రూ. 1200 వరకు అమ్ముతున్నారు. సంబంధిత అధికారులు పట్టించు



కోకపోవడంతో వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ప్రజలపై భారం మోపుతున్నారు. టపాసుల దుకాణాల నిర్వాహకులు మామూలు ఇస్తే చాలు.. క్షేత్రస్థాయిలో ఎలాంటి తనిఖీలు చేయకుండానే అధికారులు దుకాణాల ఏర్పాటుకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యాపార నిర్వాహకులు ఈ నష్టాన్ని పూడ్చేందుకు టపాసుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఆపైన నాసిరకం టపాసులను అంట కడుతున్నారు. గత సంవత్సరం అమ్మగా మిగిలిన స్టాక్ ను ఇండ్లల్లో, తమ దుకాణాల్లో అక్రమంగా నిల్వలు చేసి.. ప్రస్తుతం తెచ్చిన కొత్త స్టాక్ లో కలిపి కాలం చెల్లిన టపాసులను వినియోగదారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఏది ఏమైనా అధికారులు స్పందించి టపాసుల దుకాణాలను తనిఖీ చేసి.. టపాసుల ధరలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. అయితే నిబంధనల మేరకే టపాసులకు అనుమతులు ఇచ్చాయని అగ్నిమాపక శాఖ అధికారి కార్తీక్ తెలిపారు. నిబంధనలు పాటించని దుకాణాల లైసెన్స్ రద్దు చేసి. ఆ షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



**తాండూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14, 17 బాల బాలికల జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 250 క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్, పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, పాఠశాల అకాడమీ డైరెక్టర్ సౌమ్య, జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ ఎండి యాకూబ్, ప్రిన్సిపాల్ సరోజినీ, పోటీల చెస్ ఆర్బిటర్స్ సమ్మయ్య, అకాష్, కార్తీక్, అబ్బర్సర్ పాశం శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శులు బాలకృష్ణ, రాజు, తారేకేశ్వేరి వ్యాయామ ఉపాధ్యాయులు రాజమోహమ్మద్, వహీదా బేగం, విశాల, వామన్ హరీష్, శివ, వినేష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పత్తి ఏరడానికి కూలీల కొరత



చేనులోనే పత్తి పంట
కూలీల లేక తంటాలు పడుతున్న రైతులు
స్థానికంగా దొరకని తీరు - ఇతర ప్రాంతాల నుంచి తరలింపు


**కుభీర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఈసారి పత్తి పంట సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పేటట్లు లేవు. పంటకు తెగుళ్లు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, వాతావరణ పరిస్థితులు ఇలా అనేక ఒడిదుడులతో పత్తి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావడం లేదు. ధరలు తగ్గుముఖం పడతుండడంతో వీలైనంత త్వరగా పత్తిని సేకరించి అమ్ముకోవాలని అనుకుంటున్నా కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటను తీయిస్తున్నారు. సోయా, పత్తి పంట సీజన్‌లో ఒకేసారి చేతికి రావడంతో సాగుదారులు వ్యవసాయ కూలీల కోసం కళ్లల్లో వొత్తులేసుకుని వెతుకులాడుతున్నారు. కుభీర్ మండలం మహారాష్ట్రకు సరిహద్దులో ఉంది. సోయ పంట కోతకు, పత్తి తీయడానికి, మహారాష్ట్ర కూలీల పైనే ఆధార పడాల్సిన పరిస్థితి. వర్షాల కారణంగా సోయ పంట కోతలు ఆలస్యం అయింది. ప్రస్తుతం మహారాష్ట్ర కూలీలు ఒక టీం గా ఏర్పడి ప్రత్యేక వాహనాల్లో, ఆటోల్లోను వచ్చి సోయ కోతకు ఒక బ్యాగ్‌కు 3500 నుంచి 4000 వాళ్ళు వచ్చిన వెహికల్ కిరాయిని సైతం తీసుకుంటున్నారు. దీంతో ఒక్కో కూలి రోజుకు 700, 800 సంపాదిస్తున్నాడు. పత్తి పంట పగలడంతో కిలో పత్తికి ఇస్తామన్నా దొరకని పరిస్థితి నెలకొంది. పత్తితీత కూలీలకు గిట్టుబాటు కాకపోవడంతో సోయ కోయడానికే ఆసక్తి చూపుతున్నారు. పత్తి తీయడం ఆలస్యం కావడం దూది నాణ్యత తగ్గుతుందని, తేమ శాతం తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ఖత్రి సమాజ అధ్యక్షునిగా ఆదిత్య ఖండేష్కర్

**ఆదిలాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా సోమవంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి) సమాజ్ అధ్యక్షునిగా ఆదిత్య ఖండేష్కర్, ప్రధాన కార్యదర్శిగా బండేవార్ రాజ్ శ్రీనివాస్ గెలుపొందారు. ఆదిలాబాద్ లోని సంఘ భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నిలేష్ ఖత్రిపై 176 ఓట్ల అత్యధిక మెజార్టీతో ఆదిత్య ఖండేష్కర్ గెలుపొందారు. సమాజ్ లో మొత్తం 272 ఓటర్లు ఉండగా, నిలేష్ ఖత్రికి 54 ఓట్లు రాగా, ఆదిత్య ఖండేష్కర్ 230 ఓట్లు వచ్చాయి. సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను పలువురు సమాజ్ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కసంఘం సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సమాజ్ సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

**సమిష్టి నిర్ణయాలతోనే సమాజాభివృద్ధి....**
సమిష్టి కృషితోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఖత్రి సమాజ్ అధ్యక్షునిగా ఎన్నికైన ఆదిత్య ఖండేర్కర్ శాలువాతో సన్మానించి అభినందించారు. కుల సంఘాలు కలిసికట్టుగా ఉంటేనే హక్కులను సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులున్నారు.







# మతాబుల రోజు జర భద్రం

## తగిన జాగ్రత్తలు అవసరం.. లేకపోతే అనర్థాలు తప్పవంటున్న వైద్యులు

వెలుగుల పండుగ దీపావళి రోజు ప్రతి లోగిలిలో వెలుగులు విరజిమ్మాల్సిందే. పిల్లలైనా, పెద్దలైనా దీపావళి రోజు టపాసులు పేల్చలేదంటే ఆ ఇంట్లో పండుగ సంబురంలేనట్లే. పండుగ రోజు ఇంటిల్లిపాతి కలిసి సంతోషంగా ముందుగుండు కాల్చితేనే పండుగకు పరమార్థం. అయితే పండుగ రోజు టపాసులు, బాణసంచా కాల్చడం ఎంత ప్రధానమో తానికి తగ్గ జాగ్రత్తలు తీసుకోవడం కూడా అంతే అవసరం. ఇది లోపించడం వల్లే ఆనందంగా పండుగ జరుపుకోవాల్సిన ఇళ్లలో పండుగ రోజు ప్రమాదాలు కంటతడిపె ట్టిస్తున్నాయి. ఏటా దీపావళి సందర్భంగా జరిగే ప్రమాదాల్లో వేల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి తోడు ఆస్తి, ప్రాణ నష్టాలు కూడా జరుగుతున్నాయి. ఇటువంటి దుర్ఘటనలు జరుగకుండా చూసుకోవాలంటే మాత్రం బాణా సంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిఫుణులు సూచిస్తున్నారు. అలాగే పండుగ సందర్భంగా టపాసుల విక్రయ కేంద్రాల వద్ద ఏమరుపా టుతో జరిగే ప్రమాదాల వల్ల కూడా పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరుగుతుంది. ముఖ్యంగా నగరంలోని మలక్‌పేట, హోల్సేల్ దుకాణాల తో పాటు ప్రతి సెంటర్‌లోనూ టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ వారు టపాసులను కాల్చడంతో పాటు వాటిని విక్రయించే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరిస్తున్నారు.

### వినియోగదారులు ఇళ్ల వద్ద..

1. నాణ్యమైన బ్రాండ్ టపాసులు మాత్రమే కొనుగోలు చేయాలి.
2. పైకి ఎగిరే టపాసులను ఏ మాత్రం పక్కకు ఒరిగేలా కాకుండా నిటారుగా ఉంచి కనీసం మీటరు దూరం నుంచే కాల్చాలి. ప్రమాదవశాత్తు ఇవి పక్కకు ఒరిగితే ఇళ్లలోకి, పక్కింట్లోకి వెళ్లి ప్రమాదాలతో పాటు గొడవలకు కారణమయ్యే వీలుంది.
3. కాల్చేటప్పుడు తప్పని సరిగా ఇంటిల్లిపాది కాటన్‌దుస్తులనే ధరించాలి. చెప్పులు,బూట్లు ధరిస్తే మరీ మంచిది. సాధ్యమైనంత వరకు దూరం నుంచే బాంబులు కాల్చాలి.
4. సరిగా కాలని టపాసులు, చిచ్చుబుడ్లను మరోసారి కాల్చేందుకు ప్రయత్నించకూడదు. ఎందుకంటే తీరా దగ్గరకు వెళ్లిన తరువాత అవి పేలే అవకాః ఉంది. పేలని వాటిపై దూరం నుంచే నీళ్లు పోస్తే బెటర్.
5. బయట టపాసులు కాల్చేటప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచుకోవాలి.
6. పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు పేల్చినప్పుడు చెవిలో దూదిని పెట్టుకోవడం మంచిది. లేకపోతే ఏమరపాటులో అవి దగ్గరగా ఉన్నప్పుడు పేలితే కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉంది.
7.ఇనుప వస్తువులతో చేసిన కాకరపువ్వొత్తులు కాల్చిన తరువాత వాటిని నీళ్లలో వేసి ఆతరువాత చెత్తలో పడవేయాలి. లేకపోతే ఇంటి పరిసరాల్లోనే వస్తే కాళ్లకు గుచ్చుకుని ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉంది.



### చిన్నపిల్లల విషయంలో..

1. చిన్నపిల్లలు మతాబులు, టపాసులు కాల్చేటప్పుడు వీలయినంత వరకు తల్లిదండ్రులు వారి వెంటే ఉండాలి.
2. కాకర వొత్తులు, తేలికపాటి మతాబులనే పిల్లల చేత కాల్పించడం మేలు.
3. సాధారణంగా మనం పెద్ద టపాసులు రాకెట్లను కాల్చినప్పుడు పిల్లలు కూడా వాటివల్ల కలిగే ప్రమాదాలు తెలియక మేమూ అవే కాల్చుతామంటూ మారాం చేసే వీలుంది. ఈ విషయంలో తల్లిదండ్రులు చిన్న సౌజు మతాబుల పట్ల చిన్నారులకు ప్రేమ కలిగేలా వారికి నచ్చ జెప్పాలి.
4. ఇంటి వద్ద కూడా తగినంత నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవడం మేలు.
5. మనకు తెలియకుండానే పిల్లలు తమ జేబుల్లో టపాసులను దాచుకునే వీలుంది. తల్లిదండ్రులు పిల్లల దగ్గర ఏ విధమైన పేలుడు వస్తువులు ఎంచుకోకుండా జాగ్రత్త పడటంతో పాటు వారిని అనుక్షణం పరిశీలిస్తుండాలి.
6. ఒక్క క్షణం ఏమరుపాటుకు గురైనా జరిగే ప్రమాదాన్ని టపాసులు పేల్చేటప్పుడు అనుక్షణం గుర్తు చేసుకుని పిల్లలను గమనిస్తుండాలి.
7. పేలుడు సమయంలో చిన్నచిన్న నిప్పురవ్వలు మీదపడే అవకాశం ఉంది. అందుకే అయోడిన్, దూది లాంటి వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి.

### ప్రమాదాలు సంభవిస్తే..

- ఎవరైనా మంటల్లో చిక్కుకుంటే వెంటనే అతనిపై అందుబాటులో ఉన్న నీళ్లను చల్లాలి. అగ్ని ప్రమాదాల సందర్భంలో నీళ్లు పోయకూడదనే ప్రచారం ఉంది. ఇది ఎంతమాత్రం సరికాదు. దీని వల్ల మంటల తాకిడి శరీరపైభాగానికే పరిమిత మవుతుంది. లోపలి భాగాలకు చేరదు. వెంటనే ఆస్పత్రులకు చేర్చాలి.

ఈ సమయంలో ముందుగా ఆస్పత్రులకు కూడా ఫోన్ చేయడం మంచిది. ఎందుకంటే ప్రమాద తీవ్రతను బట్టి మనం వెళ్లే లోగా వారు సిద్ధంగా ఉండే అవకాశం ఉంది.


### టపాసుల అమ్మకం కేంద్రాల వద్ద..

- ప్రతి దుకాణం వద్ద కార్బన్‌డైఆక్సైడ్‌తో నింపిన అగ్నిమాపక పరికరం, డ్రై, కెమికల్‌పౌడర్‌తో పాటు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు వీలుగా వీలయితే తగినంత ఇసుకను కూడా అందుబాటులో ఉంచుకోవాలి.
- భారీ ఇసుక నిల్వతో పాటు పెద్ద ఎత్తున నీరు కూడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.
- దుకాణాల వద్ద, పరిసర ప్రాంతాల్లో పొగ తాగరాదు అనే బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల్లో ఎక్కడా పొగరాయుళ్లు, చెత్తను తగుల బెట్టేవారు లేకుండా చూసుకోవాలి.
- దుకాణాల వద్ద పోగయిన చెత్తను దుకాణాదారులే దూరంగా తీసుకెళ్లి చెత్తకుప్పలకు చేర్చాలి. మున్సిపాలిటీ సిబ్బంది ఏమరుపాటుగా చెత్తను అక్కడే కాల్చితే గాలి వాటుకు ఏ ప్రమాదమొ చోటు చేసుకునే అవకాశం ఉంది. దుకాణాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు పదార్థాలను వేలాడదీయకూడదు. కచ్చితంగా పుట్టెల్లో ఉంచి మాత్రమే విక్రయించాలి. వినియోగదారులు వచ్చినప్పుడు తెరిచి చూపించినా వెంటనే మూతలు పెట్టాలి.
- అమ్మకం స్టాల్‌ను వెదురు తడకలు, ఇతర వాటితో వేయకూడదు. ఇనుప రేకులతోనే సైడ్లు, పై కప్పు ఉండేలా చూసుకోవాలి.
- దుకాణాలను జనావాసాల నడుమ ఏర్పాటు చేయరాదు. ప్రతి దుకాణం మధ్య కనీసం మూడు మీటర్లకు పైగా వ్యయం ఉండాలి.










# పంచ పర్వం.. షోడశ మహా పర్వం.. దీపావళి..

దీపావళి పండుగ శ్రీ కేదారేశ్వర వ్రతం. 30-10-2024 బుధవారం ధన త్రయోదశి.( శ్రీ ధన్వంతరి పూజ)31-10-2024 గురువారం నరక చతుర్దశి.01-11-2024 శుక్రవారం. దీపావళి పండుగ. ధనలక్ష్మి పూజ. శ్రీ కేదారేశ్వరవ్రతం.02-11-2024 శనివారం కేదారేశ్వర స్వామి దేవున్ని ఎత్తుకోవాలి. (బమ్మెర భక్త పోతన జయంతి) భాగవతం రచయిత.03-11-2024 ఆదివారం యమవిదియ.(భగినీ హస్తభోజనం).05-11-2024 మంగళవారం నాగ చతుర్థి. (నాగులచవితి). 06-11-2024బుధవారం నాగపంచమి.

దీపావళి ఒకరోజు పండుగ కాదు-పంచ పర్వం, షోడశ మహా పర్వం.. దీపం అనగా దిప్తి, జ్యోతి, ప్రకాశందేవతలు జ్యోతిస్వరూపాలు. దైవాన్ని జ్యోతి స్వరూపంగా జ్యోతిని దైవంగా ఆరాదించడమనే వేదోక్త ధర్మపర్వమే దీపావళి పండుగలో జ్యోతకం అవుతుంది. దీపావళి వైశిష్యాన్ని చూస్తే దీపారాధనకు గల ప్రత్యేకత అర్థమౌతుంది. దీపం దైవంగా చెప్పిన వేదోక్త తత్వం నుంచి చూస్తే 'దివ్' అనే ధాతువు నుంచి దైవం అనే పదం పుట్టింది. వెలుగును, తేజస్సును, ప్రకాశాన్ని, ఈశ్వర తత్వాన్ని పరంజ్యోతిగా పూజించడమే దీపారాధన. దైవానికి దీపం అని కాకూండా దీపాన్నే దైవంగా దర్శించే పద్ధతి.



సిద్ధాంత శిరోమణి, జ్యోతిర్వాస్తు సామ్రాట్, ప్రతిష్ఠాసార్వభౌమ, మంత్రశాస్త్ర విభూషణ
డా.ఎ. ప్రసాద శర్మ సిద్ధాంతి
సెల్: 9866077928,9849859487

దీపాన్ని వెలిగిస్తూ చదివే వేద మంత్రము...
ఓం ఉద్దేప్యస్వ జాతవేదోపఘ్నన్ నిరురుత్తింమమ!

అర్థాన్ని చూస్తే అగ్ని రాక్షస,దుష్ట,పాప తత్వాలని నశింపచేసి ప్రదీప్తిని కలిగించుగాక! అంటే మన బాధల్ని తీసివేసి, ప్రకాశాన్ని ఇవ్వడం అనే రెండు ప్రయోజనాలు కలుగుతాయి. చీకటి అనే బాధలను తప్పించి వెలుగు అనే ప్రకాశంలోకి నడిపిస్తుంది.అంతరార్థాన్ని గ్రహిస్తే ఈ ఋషివాక్యం నుంచి జ్ఞానజ్యోతిని మనలో వెలిగిస్తే వివేకమైన ఆనంద మార్గం సాధ్యపడుతుంది. భగవతారాధనలో ప్రథమ, మధ్య, అంత్య దీపారాధనా క్రమాలున్నాయి. మొదట దీపారాధనతో అగ్నిసాక్షిగా పూజను ప్రారంభించి, మధ్యలో దీపం దర్శయామి అని, ఆరార్తికం, నిరాజన పేరుతో చివరగా కర్పూరాది మంగళ కరమైన కాంతిని సమర్పించడం జరుగుతుంది. వేదాదులన్ని ఎవరి నుంచి జాతమయ్యాయో అట్టి అగ్ని స్వరూపమే పరమాత్మ. అందుకే పరమాత్మని పరంజ్యోతి అని అంటే విశ్వంలో సూర్యచంద్రాదులతో సహా సమస్త ప్రాణి కోటికి వెలుగును ప్రసాదించే దిప్తి అనేది వేదొక్త భావన

"జ్యోతిషామపీ యద్ జ్యోతిః" అని ఉపనిషత్ ఘోష.

దిపావళి పండుగ అనేది కేవలం ఒక రోజు కాదు. ఆశ్వయుజ బహుళ. త్రయోదశి- ధన త్రయోదశి, బహుళ చతుర్దశి - నరక చతుర్దశి,బ. అమావాస్య - దిపావళి, కార్తిక శుద్ధ. పాడ్యమి - బలిపాడ్యమి. కార్తిక శుద్ధ విదియ - యమద్వితీయ తోకలిపి ఐదు రోజుల మహా పర్వం. ఇది ఒక పద్ధతి.

ఆశ్వయుజ బహుళ. త్రయోదశి- ధన త్రయోదశి- ఆశ్వయు జ మాసం కృష్ణ పక్ష త్రయోదశిని 'ధన త్రయోదశి' అంటా రు. దీన్ని సంపత్ప్రదాయకమైన రోజుగా, ఆరోగ్యాన్ని ప్రసా దించే దినంగా పురాణాలు చెబుతున్నాయి. క్షీర సాగర మథ నంలో లక్ష్మీదేవి ఉద్భవించిన రోజు ఇదేనని చెబుతారు. కాబ ట్టి ఈ రోజున లక్ష్మి దేవినీ, ధనాధిపతి అయిన కుబేరుడినీ పూజిస్తే ఐశ్వర్యం ప్రాప్తిస్తుందంటారు. దీన్ని 'కుబేర త్రయో దశి', 'ఐశ్వర్య త్రయోదశి' అని కూడా పిలుస్తారు. ఉత్తర భా రత్‌లో ఈరోజును 'ధన్ తేరస్' అంటారు. ఈ రోజున బంగా రం, వెండి కొంటే ఏడాది పొడుగునా లక్ష్మీదేవి ఇం ట్లో కొలువ వుతుందని విశ్వసిస్తారు. అంతేకాదు, పితృదేవతలు ఈ రోజున తమ వారసుల ఇళ్ళకు వస్తారనే నమ్మిక ఉంది.

## యమ త్రయోదశి

లక్ష్మీదేవితో పాటు ఆరోగ్యానికి అధిపతి, ఆయుర్వేదానికి మూలపురుషుడు అయిన ధన్వంతరి కూడా క్షీరసాగరం నుంచి అమృత కలశాన్ని చేతబూని ఈ రోజే ఉద్భవించాడని పురాణాలు అంటున్నాయి. అందుకే దీన్ని 'ధన్వంతరి త్రయోదశి'గా వ్యవహరిస్తారు. ఆయనను స్మరిస్తే ఆరోగ్యం, ఆయుష్షు వృద్ధి చెందుతుందని విశ్వసిస్తారు. ఈ రోజుకు 'యమ త్రయోదశి' అని మరో పేరు ఉంది. ఈ రోజున సూర్యాస్తమయ సమయంలో ఇంటి ద్వారానికి ఇరువైపులా దీపాలు వెలిగిస్తారు. వాటిని 'యమదీపాలు' అంటారు. ఆ ఇలా దీపాలు వెలిగిస్తే యముడు ప్రసన్నుడవుతాడనీ, అకాల మృత్యువును నివారిస్తాడనీ పెద్దలు చెబుతారు.

## ఆశ్వయుజ బహుళ చతుర్దశి - నరక చతుర్దశి

నరాం క్రందయితీతి నరకః - అంటే నరులకు దుఃఖాన్ని కలుగచేసే నరకం నుంచి తప్పించిన రోజే నరక చతుర్దశి. నరక చతుర్దశి ఆచరణ వెనక ఉన్న గాథల్లో నరకాసురుడి గాథ ప్రధానమైంది. హిరణ్యాక్షుడు లోకానికి ఉపద్రవంగా భూదేవిని చుట్టచుట్టి సముద్రంలో ముంచినప్పుడు విష్ణమూర్తి వరాహావతారమెత్తి, ఆ రాక్షసుని సంహరించి భూదేవిని ఉద్ధరించాడు. ఆ సందర్భంగా భూదేవికి విష్ణుమూర్తి వరప్రసాదం వలన భీముడనే పుత్రుడు జన్మించాడు. అతనే దుర్మార్గుడైన నరకాసురునిగా పేరొందాడు. నరకుడు ప్రాగ్జోతిషపు రం రాజధానిగా కాపరూప రాజ్యాన్ని పాలిస్తూ ఉండేవా డు. భూమాత తన కుమారుని రాక్షసత్వానికి దూరంగానే పెం చింది. దురదృష్టవశాత్తు నరకుడు అసుర ప్రభావంలోపడి ఘోరతపస్సు చేసి అనేక వరాలు పొందాడు. తనకు తన తల్లి చేతిలో తప్ప మరణం సంభవించకూడదని కూడా వరం పొందాడు. స్వయాన తన తల్లే తనను చంపదని అతని ధీ మా. ఆ వరగర్వంతో అతను కావించిన దుష్కార్యాలు పరాకాష్టకు చేరి దేవతలను తీవ్ర అశాంతికి గురి చేసాయి. విష్ణుద్వేషియై దేవతలను హింసించసాగాడు. దేవమాత అదితి క ర్ణాభరణాలను, వరుణ ఛత్రాన్ని అపహరిస్తే శ్రీకృష్ణుడు ఇతనిని ద్వందయుద్ధంలో ఓడించి, వాటిని తిరిగి అదితికి అందజేసాడు.

మనం ఆచరించే పండుగలలో ఒక రాక్షసుణ్ణి మరణాన్ని ఆనందంగా పండుగ చేసుకోవడం - నరక చతుర్దశి విశిష్టత. పండుగలకు - ఖగోళ సంఘటనలకు సంబంధం ఉంది. నరకాసుర వధ - చతుర్దశి నాడు (ఆశ్వయుజ బహుళం) ఆకాశంలో రాసులస్తితిని సూచించేది. తులారాశి తూర్పు క్షితిజం మీద ఉదయిస్తుంటే పడమటి క్షితిజం మీద మేషరాశి అస్తమిస్తుంటుంది. నరకుడు భూదేవి కొడుకు. మేషం సహజంగా మంచిదే అయినా మూర్ఖత్వమూర్తి. కనుక అతని పాలన అంధకారమయం! ఆ రోజు మేష రాశి సూర్యాస్తమయ సమయంలో ఉదయిస్తుంది. అది అస్తమించే వరకు చీకటే! మేష రాశి అస్తమించే వేళకు తులారాశి తూర్పు దిక్కున క్షితిజం మీదికి వస్తుంది. స్వాతి నక్షత్రానికి వాయువు దేవత. దాన్ని అధిష్టించి నరకుని మీదికి బయలుదేరిన కృష్ణుడు - సూర్యుడు, సత్యభామ-చంద్రుడు. నరకుడు చనిపోగానే ఆకాశపు అంచులపై దీపచ్ఛాయాల్లో కన్యారాశి (కన్యల గుంపు) నరకుని బంధాలనుంచి విడివడి, తమను విడిపించిన సూర్యున్ని - కృష్ణున్ని నాయకునిగా చేసుకునింది. ఇలాంటి స్థితి నరక చతుర్దశి, దీపావళి రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో లేదు. నరక భావాలు అంటే దుర్భావాలను, కృష్ణభక్తి అనే చక్రాయుధంతో ఖండింప చేసి, జీవుడు భవద్దర్శన ప్రాప్తితో ఆనందించాలి అనేది ఇందులోని అంతరార్థం. నరాకాసురవధ స్త్రీ స్వాతంత్ర్యానికి నిదర్శనం.

ఆశ్వయుజ బహుళ అమావాస్య - దీపావళి అంటే దీపాల వరుస అని. విశేషంగా దీపావళి రోజున లక్ష్మి ఆరాధన చేస్తాం. లక్ష్మిని లోకైక దీపాంకురాం అని,దీపలక్ష్మీ నమోస్తుతే అని స్తుతి. లక్ష్మీదేవికి దీపానికి ఉన్న ఏకభావనత వల్ల లక్ష్మి వలన జ్ఞానం, ఆనందం, ఐశ్వర్యం అనే త్రివిధఫలాలు లభిస్తాయి.

సూర్యేందు కోటి ప్రభవాసుదేవ
దీపావళిం గోఘ్రుతవర్తియుక్తం
సమయయాంద్రీకృత సర్వలోక
జ్ఞాన ప్రదీపం కురుతే నమోస్తు.

ఇందున్న దీపావళి అనే శబ్దాన్ని చూస్తే దీపాలని వరుసగా వెలిగిస్తే మాయాంధకారాలు తొలగి జ్ఞానం, ఆనందం, ఐశ్వర్యం సర్వులకు కలుగుతాయని అర్థం. దీపాల సమూహ పర్వం వెనుక లక్ష్మి ఆరాధన, దుఃఖ నిర్మూలనే ప్రధాన లక్ష్యం. దీపావళి- రాష్ట్రాల వారీగా సంప్రదాయాల్లో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, ఒకే స్థాయి ఉల్లాస, ఉత్సాహాలతో నిర్వ హించే వేడుక ఇది. ఈ రోజు ఏ ఇంట దీపాలు వెలుగుతా యో ఆ ఇంట మహాలక్ష్మి ప్రవేశిస్తుందన్న విశ్వాసం ఉంది. అందుకే దీపాల వరుసలతో ఆమెకు స్వాగతం పలుకుతారు. ఇల్లంతా దీపాలతో అలంకరిస్తే, ఇంట ఆమె కొలువై ఉంటుందని నమ్మకం. సాయంత్రం లక్ష్మీరూపమైన తులసికోట ముం దు ముందుగా దీపాలు వెలిగిస్తారు. తరువాత శ్రీమహాలక్ష్మిని పూజిస్తారు. తరువాత పిల్లలూ, పెద్దలూ బాణాసంచా కాలు స్తూ దీపావళిని జరుపుకొంటారు.

## బలిపాడ్యమి ...

దీపావళి మర్నాడు బలిపాడ్యమి. చతుర్దశి నాడు విష్ణుమూర్తి వామనుడి రూపంలో పాతాళానికి అణిచేసిన బలిచక్రవర్తి మళ్లీ భూమ్మీదకి తిరిగివచ్చిన రోజు ఇదేనని చెబుతారు. బలికి పూజలు చేస్తారు. మహారాష్ట్ర వాసులు ఈ రోజును నవ దివస్గా భావిస్తారు. గుజరాతీయులకు ఇది ఉగాది. నందగోపాలుడు గోవర్దన గిరినెత్తి రేపల్లె వాసులను కాపాడిన రోజూ ఇదే.

## యమ ద్వితీయ- భగినీ హస్త భోజనం

ఈ రోజును యమ ద్వితీయ, భాయిదూజ్గా జరుపుకుంటారు. సోదరులు తన సోదరి చేతి భోజనం తింటే అపమృత్యు భయాలు తొలగిపోతాయి. సూర్యభగవానుడి కుమారుడు యముడు, అతడి సోదరి యమున. యమి తన సోదరుణ్ని ఎంతగానో అభిమానించేది. నిత్యమూ త[illegible] మిత్రులతో గడుపుతూ ఎన్నిసార్లు కోరినా ఏదో ఒక పనితో క్షణం తీరికలేక సోదరికి ఇంటికి యుముడు వెళ్లలేక పోయాడు. ఈ పరిస్థితిలో యమున కార్తీక శుక్ల విదియనాడు తప్పకుండా రమ్మని ఆహ్వానిస్తూ వాగ్దానం తీసుకుంటుంది.దీనికి యముడు నన్నెవరూ ఇంటికి పిలవరు.. అయినా నా తోబుట్టువైన ఆడపడుచు స్వయంగా, సాదరంగా ఆహ్వానించింది... కనుక వెళ్లితీరాలి అని నిర్ణయించుకుని వెళ్లాడు. అలా వచ్చిన సోదరుణ్ని చూసి సంతోషించి, అతనికి అభ్యంగనస్నానం చేయించి, తిలకం దిద్ది, స్వయంగా వండిన పదార్థాలను ప్రేమతో కొసరి కొసరి వడ్డించింది. సోదరి ఆతిథ్యానికి సంతోషించిన యముడు ఆమెను వరం కోరుకోమన్నాడు. ఏటా ఆ విధంగానే వచ్చి తన ఇంట విందు స్వీకరించమని కోరింది యమున. సోదరీ, సోదరుల మధ్య అప్యాయతకు ఈ పర్వదినం ఆదర్శంగా నిలుస్తోంది. అలాగే పౌర్ణిమాంత మాసాన్ని అనుసరించే ఉత్తర భారత దేశంలో ఆశ్వయుజ బ అమావాస్య (వారికి కార్తీక అమావాస్య) నుండి కార్తిక పౌర్ణమి దేవదివాళిగా జరిపుకునేవరకు మొత్తం 16 రోజుల పండుగ దీపావళి.

# శ్రీలక్ష్మీ నారాయణ స్వామిని దర్శించుకున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు





**జైనథ్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి జైనథ్‌లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆలయ చరిత్ర, పురాతనత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతపై వివరించారు. అలాగే ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరణ ఇచ్చారు. కలెక్టర్ కుటుంబ సభ్యులకు ప్రసాదం అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిశుభ్రత, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పచ్చదనం పెంపు, అందమైన వసతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ఆలయాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన ఆలయాధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు



**ఖానాపూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రుల పైన, వాహనదారుల పైన కేసులు నమోదు చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోనూ ఆదివారం ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేయగా మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలను నడుపుతూ పట్టుబడ్డారు. పట్టుబడిన 10 వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చిన వారిపై వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా ధన్వంతరి నారాయణ స్వామి జయంతి

**దండేపల్లి, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

దండేపల్లిలో నాయి బ్రాహ్మణుల కుల దైవం శ్రీ ధన్వంతరి నారాయణ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కంది శంకరయ్య మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణ కులస్తులు అందరూ ధన్వంతరి నారాయణ స్వామిని ప్రతి రోజు పూజించాలన్నారు. ప్రతి షాపులో స్వామి ఫోటో పెట్టుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రమేష్, శేఖర్, పాల్గొన్నారు.



# ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ తనిఖీలు

## భారీగా నగదు సీజ్

**ముథోల్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అంతరాష్ట్ర చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ సోదాలను అధికారులు చేశారు. ఈ దాడుల్లో భోరజ్ చెక్‌పోస్టులో రూ.1.26 లక్షలు, బైంసా చెక్‌పోస్టులో రూ.3 వేలు, కుమురంభీం జిల్లా వాంకిడి చెక్‌పోస్టులలో రూ.5,100లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ చెక్ పోస్ట్‌లలో లెక్కలోలేని నగదు గుర్తించి స్వాధీనపరచుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీఏ చెక్ పోస్ట్‌ల్లో వాహన డ్రైవర్ల నుంచి డబ్బులు తీసుకుంటున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ



అధికారులు వెల్లడించారు. ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు సిఫార్స్ చేసినట్లు తెలిపారు. ఏసీబీ అధికారుల దాడులు సంచలనం సృష్టించాయి.



# ఆదివాసీలు అభివృద్ధి చెందాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. అంతకు ముందు డప్పు వాయిద్యాలు నడుమ గుస్సాడి నృత్యాలతో స్వాగతం ఎస్పీ కి పలికారు. ఇరు గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు విద్యా, వ్యాపారం, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి చెందాలని సూచించారు. మూఢ నమ్మకాలను విశ్వసించకుండా ఉండాలని, ప్రభుత్వ ప్రైవేటు వైద్యాలను సంప్రదించి వైద్య చికిత్సలు తీసుకోవాలని ఎలాంటి బాబాల మంత్రగాలను నమ్మవద్దని తెలిపారు. అనంతరం ఆదివాసి యువకులతో మమేకమై చాచోయ్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మాడావి ప్రసాద్, ఆదివాసి సమన్వయకర్త చెంచు రామకృష్ణ, ఎస్ఐ సాయన్న, గ్రామ పటేల్ మెస్రం వెంకట్ రావ్, మెస్రం ఆనందరావ్, మెస్రం నాగ్నాథ్, కోట్నాక్ బారిక్ రావ్ కోసరవ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# మరో 5 రోజులు ఛాన్స్

## 'లిక్కర్' దరఖాస్తుల గడువు పెంచిన ప్రభుత్వం

### 23 దాకా దరఖాస్తు చేసుకోవచ్చన్న

### ఎక్సైజ్ శాఖ బంపరాఫర్ - బీసీ బంద్, సెలవులే కారణం

**ఆదిలాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

లిక్కర్ షాపుల దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. బీసీ బంద్, బ్యాంకుల బంద్ల కారణంగా దరఖాస్తులు సమర్పించలేకపోయిన ఉత్సాహకులు విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని గడువు పొడిగించినట్లు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ తెలిపారు. మద్యం షాపుల లైసెన్సుల కోసం దరఖాస్తులను ఈనెల 23వ తేదీ వరకు స్వీకరించనున్నారు. ఇంతకు ముందు ఈనెల 23న కలెక్టర్ల సమక్షంలో జర గాల్సిన డ్రా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు తెలిపారు. ఈనెల 27వ తేదీన డ్రాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ చెప్పారు. ఉత్సాహకుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. అన్ని జిల్లాల కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా డ్రా కార్యక్రమం నిర్వహిస్తాం అని తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి. షాపు దరఖాస్తు ఫీజు నాన్ రిఫండబుల్ విధానంలో రూ.3లక్షలుగా నిర్ణయించినప్పటికి భారీగా దరఖాస్తులు రావడం గమనార్హం. దీంతో ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో భారీగానే ఆదాయం రాబోతున్నట్టు తెలుస్తోంది. అయితే రిజర్వ్‌డ్ దుకాణాలకు తక్కువ దరఖాస్తులు రావడం, కొన్నిచోట్ల వ్యాపారులు సిండికేట్ కారణంగా ఒకటి రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వచ్చిన దరఖాస్తుదారుల నుంచి లాటరీ తీసి డ్రాలో వచ్చినవారికి దుకాణాలను కేటాయిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు (రెండేళ్లపాటు) ఈ లైసెన్స్ విధానం అమల్లో ఉంటుంది.





# బాడీ అంతా 199 కుట్లు...

స్టార్ హీరో విశాల్ ఇటీవలే 'మదగజరాజ' సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తన 35వ సినిమా 'మకుటం' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. సినిమాలతో పాటు 'యువర్స్ ఫ్రాంక్లీ విశాల్' అనే చిట్ చాట్ షోతో ప్రేక్షకులను అలరించనున్నట్లు ఇటీవలే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు. ఇందులో విశాల్ తన సినీ కెరీర్ కి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాల్లో బాడీ డబుల్స్ ఉపయోగించడం గురించి మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. విశాల్ మాట్లాడుతూ.. సినిమాలో ఎంతటి కష్టమైన స్టంట్స్ అయినా సరే తానే స్వయంగా చేస్తానని తెలిపారు. డూప్స్ తో చేయించడం తనకు ఏ మాత్రం ఇష్టం ఉండదని అన్నారు. అలాంటి యాక్షన్ సీక్వెన్సులు చేస్తున్న సమయంలో చాలా సార్లు గాయపడ్డానని.. ఇప్పటివరకు శరీరానికి 119 కుట్లు పడ్డాయని తెలిపారు. దీంతో పాటు నటుడు అర్జున్ తో తనకున్న అనుబంధం గురించి పంచుకున్నారు. అలాగే తన హిట్ మూవీ 'పందెంకోడి' అవకాశం తనకెలా వచ్చిందో కూడా గుర్తుచేశారు. అలాగే విశాల్ అవార్డుల పై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తనకు జాతీయ అవార్డులతో సహా ఏ అవార్డులు ఇష్టం ఉండవని తెలిపారు. అవార్డు అనేది కేవలం ఎనిమిది మంది మాత్రమే నిర్ణయించడం, తీర్పు ఇవ్వడం లాంటిది. అవార్డు ఎంపికకు వారు పబ్లిక్ సర్వే ఎందుకు తీసుకోకూడదు? నాకు అవార్డు వచ్చినా.. దానిని చెత్తబుట్టలో వేస్తాను అంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇందుకు సంబంధించిన ప్రోమో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

# చరణ్ కసి కనిపిస్తోందిగా!




ఆర్ఆర్ఆర్ తో గ్లోబల్ స్టార్ గా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్ ఆ తర్వాత అదే స్థాయి సినిమాలను తీసి తన సత్తా చాటుతారని అందరూ అనుకున్నారు. చరణ్ కూడా తన కెరీర్ ను అలానే ప్లాన్ చేసుకున్నారు. కానీ తానొకటి తలస్తే దైవం ఇంకోటి తలచిందన్నట్టు స్టార్ డైరెక్టర్ శంకర్ తో తీసిన గేమ్ ఛేంజర్ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. దీంతో ఆ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, వెచ్చించిన టైమ్ అన్నీ బూడిదలో పోసినట్టయ్యాయి. గేమ్ ఛేంజర్ డిజాస్టర్ తర్వాత చరణ్ తన తర్వాతి సినిమాతో ఎలాగైనా గట్టి హిట్ కొట్టాలని ఎంతో కసిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తాను అనుకున్నది అందుకోవడం కోసం ఈసారి ఏదైనా చేయడానికి చరణ్ రెడీగా ఉన్నారు. పెద్ది సినిమా కోసం చరణ్ పడుతున్న కష్టం అంతా ఇంతా కాదని, సినిమా షూటింగ్ నుంచి వస్తున్న లీక్ వీడియోలు చూస్తుంటే చాలా స్పష్టంగా అర్థమవుతుంది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం రామ్ చరణ్ తెగ కష్టపడుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటినుంచి మంచి అంచనాలుండగా, మొన్నా మధ్య రిలీజ్ చేసిన ఫస్ట్ షాట్ కు, పోస్టర్లకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దానికి తోడు ఈ సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించడం కూడా పెద్ది క్రేజ్ ను ఇంకాస్త పెంచింది. కాగా పెద్ది సినిమా కోసం చరణ్ కష్టపడటం మాత్రమే కాకుండా రిస్క్ కూడా చేస్తున్నారని లీకైన సాంగ్ వీడియో చూస్తే అర్థమవుతుంది. సాంగ్ లో భాగంగా చరణ్, ఓ లోయ అంచున ఉన్న చెట్టు కొమ్మపై నిలబడి, ఎంతో ఈజ్ తో డ్యాన్స్ చేస్తూ కనిపించారు. చెట్టు కొమ్మపై డ్యాన్స్ వేయడమే ప్రమాదం అయితే, చరణ్ లోయ అంచున ఉన్న చెట్టు కొమ్మపై డ్యాన్స్ చేయడం ఎంత ప్రమాదమో ఊహించుకోవచ్చు. ఆ వీడియో చూసి కొందరు షాకవగా, మరికొందరు టెన్షన్ పడుతున్నారు. ఇంకొందరైతే చరణ్ డెడికేషన్ ను మెచ్చుకుంటున్నారు. ఇక రీసెంట్ గా పెద్ది షూటింగ్ నుంచి మరో వీడియో క్లిప్ బయటకు రాగా, ఆ వీడియోలో చరణ్ నిటారుగా ఉన్న కొండలు ఎక్కుతూ కనిపించారు. చరణ్ వెనుకే డైరెక్టర్ బుచ్చిబాబు కూడా ఉన్నప్పటికీ అతను మాత్రం పక్క వాళ్ల సపోర్ట్ తీసుకుని ఆ కొండను ఎక్కుతుంటే చరణ్ మాత్రం ఎలాంటి సపోర్ట్ లేకుండా కనిపించారు. ఇవన్నీ చూస్తూంటే చరణ్ పెద్ది విషయంలో ఎంత సిన్సియర్ గా ఉన్నారో తెలుస్తోంది. అంతేకాదు, మొన్నామధ్య ఓ ఈవెంట్ లో చరణ్ పెద్ది గురించి మాట్లాడుతూ, తాను ఇంతకు ముందెప్పుడూ ఇలా చెప్పలేదని, కానీ పెద్ది అద్భుతంగా ఉంటుందని స్టేట్ మెంట్ ఇవ్వడంతో చరణ్ ఈసారి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని అందరూ భావిస్తున్నారు. కాగా మార్చి 27న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది. అదే రోజున చరణ్ బర్త్ డే కూడా కావడంతో మెగా ఫ్యాన్స్ కు పెద్ది రిలీజ్ చాలా స్పెషల్ గా మారనుంది.



# పెళ్లి కాకుండానే ప్రెగ్నెంట్

'శివ మనసులో శృతి' సినిమాతో కుర్రకారును ఫిదా చేసిన రెజీనా.. ఆ తర్వాత భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులు చేసింది. ప్రస్తుతం సినిమాలతో పాటు వెబ్ సీరీస్ లలో కూడా నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. అయితే ఇటీవలే పాల్గొన్న ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పెళ్లికి ముందే ప్రెగ్నెంట్ అయ్యాను అంటూ ఈ ముద్దుగుమ్మ చేసిన కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. అయితే ఒకసారి తాను బెంగళూరులో ఉన్నప్పుడు అర్ధరాత్రి సమయంలో తనకు చాలా ఇష్టమైన "మిష్టి దోయ్" (Bengali Sweet) తినాలని అనిపించిందట. దీంతో ఆ స్వీట్ కోసం సమీపంలోని అన్ని షాపులు తిరిగిందట. కానీ, అప్పటికే రాత్రి కావడంతో ఎక్కడా దొరకలేదట. ఇక చివరికి ఒక షాప్ లో కనిపించిందట.. కానీ అప్పటికే షాప్ మూసేసే సమయం అయిపోవడంతో.. సేల్స్ బాయ్ షాప్ క్లోజ్ చేసే టైం అయ్యింది. ఇప్పుడేం సర్వ్ చేయలేము అని చెప్పారట. దీంతో ఏం చేయాలో అర్థం కాక.. తాను ప్రెగ్నెంట్ అని.. ఆ స్వీట్ తినాలని కోరికగా ఉందని అబద్ధం చెప్పారట. అలా అడగడంతో షాప్ కీపర్ వెంటనే జాలీపడి స్వీట్ ఇచ్చినట్లు రెజీనా తెలిపింది. అలా స్వీట్ తినాలనే కోరికను ఆపుకోలేక ప్రెగ్నెంట్ అని అబద్ధం చెప్పింది రెజీనా. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. బుల్లితెర స్టార్ యాంకర్ శ్రీముఖి హోస్ట్ చేస్తున్న చెఫ్ మంత్ర షోలో ఈ విషయాలను పంచుకుంది రెజీనా.

# శంభాలా విడుదలకు ముహూర్తం ఫిక్స్!



హీరో ఆది సాయి కుమార్ చాలా కాలం గ్యాప్ తర్వాత 'శంభాలా' అనే మిస్టరీ థ్రిల్లర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే మూవీ నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్, టీజర్ మంచి హైప్ క్రియేట్ చేశాయి. ఆది కెరీర్ లోనే అత్యధిక భారీ బడ్జెట్ తో రూపొందుతున్న చిత్రమిది. ఉగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఎక్కడా కూడా రాజీపడకుండా అద్భుతమైన నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా మూవీ నుంచి మరో అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఎట్టకేలకు మూవీ విడుదల తేదీని ప్రకటించారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ లో ఆది చాలా సీరియస్ గా, పవర్ ఫుల్ లుక్ ఓ కనిపించారు. అంతేకాదు ఆది పక్కన కుక్క, బ్యాక్ గ్రౌండ్ లో పొగ అస్థిపంజరం ఆకారంలో కనిపించడం మిస్టికల్ అండ్ భయంకరమైన అనుభూతిని ఇస్తోంది. గత కొన్నేళ్లుగా ఆది కెరీర్ లో సరైన హిట్టు ఒక్కటి కూడా పడలేదు. దీంతో 'శంభాలా' విజయం ఆది కెరీర్ కి కీలకంగా మారనుందని ప్రేక్షకులు భావిస్తున్నారు. హారర్, మిస్టరీ, సైన్స్ ఫిక్షన్ అంశాల కలయికగా రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది జియో-సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. శంభాలా అనే గ్రామంలో జరిగే సన్నివేశాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ప్రశాంతంగా ఉన్న గ్రామంలోకి ఒక వింత శక్తి అడుగుపెట్టడంతో ఈ కథ మొదలవుతుంది. అప్పుడు ఆ వింత శక్తి నుంచి ప్రజలను కాపాడడానికి ఆది వస్తాడు. అసలు ఆ గ్రామాన్ని పీడిస్తున్న శక్తి ఏంటి? ఆది ఆ గ్రామాన్ని ఎలా కాపాడాడు? అనేది సినిమా కథగా ఉండబోతుంది. ఈ సినిమాతో ఆది మళ్ళీ కమ్ బ్యాక్ ఇచ్చే ప్లాన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. అర్చన అయ్యర్, స్వాసిక, రవి వర్మ, మధునందన్, శివకార్తిక్, శైలజ ప్రియ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఆదివాసీ గూడేల్లో ఘనంగా దండారి ఉత్సవాలు

## సాంప్రదాయ వస్త్రాలతో గుస్సాడి నృత్యాలు చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఉట్నూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసీ గూడల్లో కన్నుల పండుగ దండారి (గుస్సాడి) ఉత్సవాలు జరుగుతున్నాయి. దండారి ఉత్సవాల్లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలో పాత ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన దండారి ఉత్సవంలో రాజాం పేట, తక్కుగూడ, కల్లూరు గూడ, దుర్గాపూర్ దండారి లు పాల్గొన్నాయి. దండారిలో కోలాటం, కచాయి కోలా, రేల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణలో నిలిచాయి. దండారి ఉత్సవంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సైతం పాల్గొన్నారు. ఆదివాసీ సాంప్రదాయ వస్త్రాలను ధరించిన ఎమ్మెల్యే తమ ఆదివాసుల తో కలిసి ఉత్సాహంగా గుస్సాడి నృత్యాలు చేశారు. దండారిలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి దండారి నృత్యాలను ఆసక్తిగా తిలకించారు.

**గిరిజన తండాల్లో...**

సారంగాపూర్ మండలం పెండల్‌దరి గ్రామంలో ఆదివారం దండారి పండగ చాలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గుస్సాడీ వేషధారణలో శ్రీహరి రావుకి ఘన స్వాగతం పలికారు. శ్రీహరి రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గొండ్ తెగ వారు తమ సంప్రదాయ పండుగ దండారిని ఎంతో ఉత్సాహంగా, ఆచార విశ్వాసాలతో, సాంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారని, గ్రామంలోని గుస్సాడీ ముత్యాలు, గుస్సాడీ వేషధారణలో ఉన్న యువకులు పల్లె వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారన్నా రు. పల్లెలో అంగరంగ వైభవంగా వెలుగు లు, సంగీతం, నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు శ్రీహరి రావు పాల్గొని, గుస్సాడీలతో కలిసి నృత్యం చేస్తూ వారిని ప్రోత్సహించారు. గొండ్ తెగ ప్రజల దండారి పండుగ, ఆదివాసీ సాంప్రదాయ, సంస్కృతి, ఐక్యతకు ప్రతీక. ఈ పండుగను తరతరాలు గా కొనసాగించడం మన సమాజ గౌరవాని కి సూచిక. ఇలాంటి సాంప్రదాయ పండుగలు సమాజంలో ఐకమత్యం, సంతోషం, ఆనందం నింపుతాయి, అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, మం డల నాయకులు, మధుకర్ దాసరి రమేష్, అడెల్లి ఆలయ ధర్మకర్త భోజన్న, పోత న్న,రాజేశ్వర్ ముత్యం రెడ్డి, పార్ పెల్లి మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



## సాంస్కృతి, సాంప్రదాయాలు

# భావితరాలకు అందించాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**నార్నూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని వాటిని భావితరాలకు అందించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ఎస్పీ పాల్గొన్నారు. గుస్సాడి, వాయిద్యాలతో ఎస్పీకి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏత్మాసూర్ పేన్‌కు సాంప్రదాయ పూజలు చేసిన అనంతరం ఆదివాసి పెద్దలు శాలువాతో సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మూఢనమ్మకాలను విశ్వసించకుండా వ్యాధుల బారిన పడితే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. బాబాలు, మంత్రగాళ్లను నమ్మవద్దన్నారు. పిల్లలకు చదువు పట్ల గల ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. అంతకుముందు ఆ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, నార్నూర్ సీఐ డి. పద్మ, ఎస్సైలు సాయన్న, అఖిల్, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి మేస్రం దుర్గుపటేల్, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్, నాయకులు రామకృష్ణ, కోశేరావ్. వెంకటరావ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# దేశ సంస్కృతి సాంప్రదాయాలకు ఆదివాసీల ఆచారాలే మూలం

## వనవాసీ కల్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర రావు



**బోథ్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలకు మూలం ఆదివాసీల సంప్రదాయాలేనని అవి భారతదేశ నగరాల్లో పట్టణాల్లో కనిపించవని వనవాసీ కల్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర రావు దేశ్పాండే పేర్కొన్నారు. ఆదివారం బోథ్ మండలంలోని ఇన్కరి గూడ గ్రామంలో జరిగిన దండారీ ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. రాణి దుర్గావతి, బిర్సాముండా, కొమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆదివాసి సమాజం కోసం మన మందరం కలి సిమెలిసి పని చేయాలని సూచించారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సార్ మేడి ఆడేం భీంరావ్, జుగది రావ్, పంద్రం శంకర్, తొడసం అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావ్ దేశ్పాండే, న్యాయవాది ఆడెపు హరీష్, నరేష్, కపిల్ గ్రామస్తులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు సన్మానం

**నిర్మల్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉత్తమ ర్యాంకులతో సీట్లు సాధించిన ఇద్దరు అమ్మాయిలకు దామెర సాహితీ క్షేత్రం నిర్మల్ నర్సింగ్ హోమ్ లో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో నర్సింగ్ హోమ్ సిబ్బంది, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. దామెర శోభారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో డాక్టర్ దామెర రాములు ప్రసంగిస్తూ ముందు ముందు మీరు ఇలాగే పీజీ సీట్లు కూడా సంపాదించి మన జిల్లాకు వన్నె తెచ్చి అశేష రోగులకు సేవలందించాలి అప్పుడే మీరు మీ తల్లిదండ్రుల రుణము జిల్లా రుణం తీర్చుకున్నట్లు అవుతుంది. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సన్మానం చేయడం జరిగింది, ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు కూడా స్పందించారు. మేము ఉత్తమ ప్రతిభ కనబరిచి చదువుకుంటామని హామీ ఇచ్చారు.





# దొంగలను పట్టుకున్న పోలీసులు

**బెజ్జూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

కొమురంభీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీ నగర్ లో గత సంవత్సరం అక్టోబర్ 13 న జరిగిన చోరీ కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ఎట్టకేలకు నింధితు లను పట్టుకొని చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్నగర్ డిఎస్పి వహీదుద్దీన్ తెలిపారు.. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి.ఎస్.పి వహిదుద్దీన్ వివరాలు వెల్లడించారు. కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీ నగర్ కు చెందిన బొల్లు.ప్రసాద్, శ్యామల దంపతులు గత సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా ప్రమిధలు కొనుగోలు చేయడానికి వెళ్లగా,ఇంటి తాళాలు పగులగొట్టిన దుండుగులు 17 తులాల ఆభరణాలు చోరీ చేశారని తెలిపారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసు బృందాలు చోరీకి పాల్పడిన గౌతమ్ బిస్వాస్ (మహారాష్ట్ర) సమీర్ మండల్ (మహారాష్ట్ర)లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి దొంగిలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.కాగా ఇద్దరు కూడా నేర చరిత్ర కలిగిన వారని ఇదివరకే వీరిపై సుమారు ఐదు కేసులు ఉన్నాయన్నారు. కాగ్ సమీర్ మండల్ ప్రస్తుతం మహారాష్ట్ర ఓ కేసు విషయంలో జైలులో ఉన్నట్టు వెల్లడించారు.

# 22 నుంచి క్రీడా పోటీలు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

ఈనెల 22 నుంచి బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్-14,17 విభాగాల్లో హ్యాండ్ బాల్, ఖోఖో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు పాఠశాలలో సంప్రదించాలన్నారు

## యువత క్రీడలతో పాటు

# చదువులోనూ రాణించాలి

**రెబ్బెన, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

రెబ్బెన మండలం కైరిగూడ గ్రామపంచాయతీలో ఆదివారం జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆత్మరామ్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆటలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని యువత క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలన్నారు.





## మైనర్ బాలికకు

# బలవంతపు పెళ్ళి..!

**ఆదిలాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**

మైనర్ బాలికకు బలవంతపు పెళ్లి చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ఆదిలాబాద్ జిల్లా మావలా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కాలనీకి చెందిన బాలిక(17) కి ఆదివారం తల్లిదండ్రులు బలవంతపు పెళ్లి చేసే ప్రయత్నం చేశారు. ఆ బాలిక చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి ఫోన్ చేసింది. దీంతో వారు వెంటనే స్పందించారు. చైల్డ్ లైన్ సూపర్ వైజర్ అనిల్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, షీ టీం కానిస్టేబుల్ మహేష్ తో పాటు మావల పోలీస్ కానిస్టేబుల్ లతో కలిసి బాలిక సూచించిన ఇంటికి వెళ్లారు. బాల్య వివాహంతో అనర్థాలు సంభవిస్తాయని తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు తల్లిదండ్రులు అతని బాలిక మేజర్ అయిన తర్వాతనే ఆమెకి ఇష్టమైన అబ్బాయితో పెళ్లి జరిపిస్తామని రాసి ఒప్పంద పత్రం రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆ బాలికను సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టి బాలికను బాల సదనానికి తాత్కాలికంగా వసతి కల్పించి సంరక్షిస్తున్నారు.



## చైతన్యదీప్తుల తారావళి

# దివ్యదీప్తుల దీపావళి

**నేలన మెరిసే దీపపు వరుసలు..నింగికి ఎగసే తారాజువ్వలు.. తరిమేస్తాయి అమావాస్య చీకట్లు.. నింపుతాయి పున్నమి కాంతులు.. ప్రతివారి ఇంటా వెలుగుల పంట.. అదే ఆనందాల సప్త వర్ణాలకేళి దీపావళి.**

**దీప మాలికల శోభతో వెలుగొందే గృహాలంకరణలు, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళ ఆనంద కోలాహలమే ఈ దివ్య దీపావళి సోయగాలు. చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే ఆశ్వయుజ అమావాస్య పండుగ, విజయానికి ప్రతీక దీపావళి. దీపాల పండుగకు ముందురోజు వచ్చే ఆశ్వయుజ బహుళ చతుర్థశిని నరక చతుర్ధశిగా జరుపుకుంటారు. నరకాసుర వధకు చిహ్నమీపండగ. దేశమంతా ఆనందోత్సాహాలు వెల్లివిరిసే పండుగ. అమావాస్య చీకట్లను వెన్నెల వెలుతురుతో నింపే పండుగ దీపావళి.**

జ్ఞానానికి చిహ్నం, ఐశ్వర్యానికి సంకేతం, సంపద – ఆనందాలకు ప్రతీక ఆశ్వయుజ అమావాస్య దీపం. ఆ దీపాన్ని ఆరాధించే దీపావళి పర్వదినం రోజు లక్ష్మీ దేవిని మహిళలు భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. నరకాసుర సంహారం జరిగినందుకు ఆనంద సూచకంగా జరుపుకునే ఈ పండుగ, మార్వాడీలకు లక్ష్మీపూజాదినం. దీపావళి రోజున జ్యోతి స్వరూపమైన మహాలక్ష్మిని పూజిస్తే అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయనీ, కుటుంబానికి అష్టైశ్వర్యాలు చేకూరుతాయని మన విశ్వాసం. దీప అంటే దీపం అని, ఆవళి అంటే వరుస... దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం.

దీపావళి రోజు ఏ ఇంట్లో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో.. ఆ ఇంట మహాలక్ష్మి తాండవిస్తుంది. అటువంటి పుణ్యదిన సాయంసంధ్య కాలంలోనే లక్ష్మీస్వరూపమైన తులసికోట ముందు దీపాలు వెలిగించి అష్టోత్తర శతనామాలతో 'చతుర్భుజాం చంద్రరూపా మిందిరా మిందు శీతలామ్ ఆహ్లాద జననీం పుష్టిం శివాం శివకరీం సతీమ్' అని ధ్యానించి.. శ్రీమహాలక్ష్మిని పూజిస్తారు. తులసీ పూజానంతరం గృహమంతా దీపాలంకృతం చేస్తే ఘల్లుఘల్లుమనే కాలి అందియల సవ్వడులతో శ్రీమహాలక్ష్మి ఆ ఇంట సందడి చేస్తుంది.

### దీపావళి అంతరార్థం

దీపావళి అనగానే సరదాగా బాణసంచా కాల్చుకుని సందడి చేసే పండుగ అనీ, దీపాలు వెలిగించే చిచ్చుబుడుల ఉల్లాసవంతమైన పండుగ అని అందరూ అనుకుంటారు. కానీ దీపాలు వెలిగించడంలో చాలా అంతరార్థం ఉంది. పితృదేవతలకూ.. దీపావళిరోజు మనం వెలిగించే దీపాలకూ సంబంధం ఉంది. అసలు దీపాలు ఎప్పుడు వెలిగించాలి? ఏ నూనెతో వెలిగించాలి? అనే ప్రశ్నకు ఓ సమాధానం చెబుతారు. ధ్యానంలో ఉన్న శ్రీ మహావిష్ణువు నిద్ర లేచే సమయం దీపావళి. చాతుర్మాస దీక్ష పాటించే నాలుగు నెలలు శ్రీ మహావిష్ణువు నిదురించే సమయంగా చెపుతారు. చతుర్మాస్యం పూర్తి అయి శ్రీమహావిష్ణువు నిద్ర మేల్కొనే రోజుగా దీపావళిని చెపుతారు. ఆయన నిద్రలేవగానే కన్నులకు వెలుగు కనిపించాలి కనక దీపాలు వెలిగించాలట. మేల్కొనటానికి ముందు సమయం దీపావళి. దానికి ప్రతీకగా తెల్లవారుజామునే లేచి తులసమ్మ దగ్గర దీపం పెట్టే సంప్రదాయం ఏర్పడింది. దీనికీ ఒక పద్ధతుంది. తులసి పూజ చేశాక కృత్తిక నక్షత్రదర్శనం చేయాలంటారు.

కార్తీక దామోదరునికి చేసే పూజే తులసి పూజ. అంటే కార్తీక మాసాధిపతి విష్ణుమూర్తే ఆ పూజలు అందుకుంటారు. తెల్లవారుజామున దామోదరుణ్ణి, పగటివేళ శివుణ్ణి, సాయంత్రం శ్రీమహాలక్ష్మిని ఆరాధించాలి.

సూర్యోదయానికి ముందే దీపారాధన చేస్తే స్వామి ప్రసన్నుడవుతాడని ప్రతీతి. ఆ దీపాలను ఆవునెయ్యి లేదా నువ్వుల నూనెతో వెలిగించడం

### దీపం ఉన్న ఇంట లక్ష్మీ ప్రవేశిస్తుంది

ప్రతి పండుగకూ అభ్యంగ స్నానాలు ఆచరించడం, కొత్త దుస్తులు ధరించడం, పిండి వంటలు భుజించడం, బంధు మిత్రులతో సరదాగా సమయాన్ని గడపటం మన సదాచారం. కానీ, ఈ పండుగకి వీటన్నిటితో పాటు మరో ప్రత్యేకత ఉంది. అది దీపాలు వెలిగించటం, బాణసంచా కాల్చటం. దీనికి సంబంధించి విష్ణు పురాణంలో ఒక కథ కనపడుతుంది 'దీపావళి నాడు మహాలక్ష్మి విష్ణువుతో కలిసి విహారం చేయాలని కోరుకుంది. అలా విహారం చేయటానికి బయలుదేరిన లక్ష్మీదేవి ఏ ఇంటిలో దీపాలు వెలుగుతున్నాయో, ఆ ఇంటిపై తన కరుణకటాక్షాలను ప్రసరించింది. అందుకే అప్పటి నుంచి దీపావళి నాటి సాయంత్రం దీపాలు వెలిగించటం ప్రారంభించారు. లక్ష్మీదేవి తనవాహనమైన గుడ్ల గూబనెక్కి సూర్యాస్తమయ సమయం, అనగా సాయం సంధ్య లేక ప్రదోషళ వేళ నుంచి అర్ధరాత్రి వరకు సంచారం చేసి దీపాలు వెలుగుతున్న ఇంట ప్రవేశించి అనుగ్రహిస్తుందని విష్ణు పురాణం చెబుతోంది.

## లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజు

క్షీర సముద్రాన్ని మథించినప్పుడు విశిష్ట వస్తు సముదాయం ఉద్భవించింది. త్రయోదశి నాడు ధన్వంతరి, అమావాస్య నాడు శ్రీమహాలక్ష్మీ జన్మించిందట. లక్షి అనగా విస్పష్టమైన గుర్తు కలిగి, వాటిపై ఆధిపత్యం కలిగిన దేవీమూర్తే (వెలిగేరూపం) లక్ష్మీదేవి. ఆమె విష్ణువుని చూచి ఇష్టపడిందట. విష్ణువు ఆమెను తన వక్షస్థలంలో చేర్చాడట. ఆమె అష్టవిధ రూపాలతో అలరారిందట. ఆ అష్టవిధరూపాలే అష్టలక్ష్ములు. లక్ష్మీదేవి జన్మదినమైన అమావాస్యనాడు ఆమెను పూజించిన వారికి అష్టైశ్వర్యాలను ప్రసాదించుతుందట. లక్ష్మీదేవి అమావాస్యనాడు పుట్టినందువల్లనే కాబోలు, అమావాస్యనాడు ఆడపిల్ల పుట్టటం శుభం అనీ, ఆపిల్ల అపురూప సుందరి, ఐశ్వర్యవంతురాలు, అదృష్టవంతురాలు అవుతుందనే నమ్మకం. దేవలోకం వారికి కూడా దీపావళి శుభప్రదమే ఒకప్పుడు దూర్వాసమహర్షి ఇచ్చిన పారిజాత పూల దండని ఇంద్రుడు అగౌరపరిచాడట. అది విష్ణువు ఇచ్చినదే అయినా, ముని తన మెడలో వేసుకున్న హారాన్ని ఇంద్రలోకాధిపతియైన తాను ధరించటం అవమానంగా ఎంచి దానిని తానెక్కిన ఏనుగు కుంభస్థలం మీద అలంకరించాడు. కాని అది ఏనుగు తలమీంచి కిందపడింది. ఏనుగు ఆ దండను కాలితో తొక్కింది. దూర్వాసుడు ఆగ్రహించి స్వర్గలక్ష్మి ఇంద్రుని తొలగిపోతుందని శపించాడు. ముని శాపం ప్రభావం వల్ల ఇంద్రుడు స్వర్గాన్ని కోల్పోయి దీనుడై బ్రహ్మను ప్రార్థిస్తాడు. వారిద్దరు కలిసి శ్రీమహావిష్ణువును ఆశ్రయిస్తారు. అప్పుడు విష్ణువు అభయం ఇచ్చి లక్ష్మిని తన దేవిగా స్వీకరించగానే ఇంద్రుని శాపం తొలగిపోయి, తిరిగి పూర్వవైభవాన్ని పొందుతాడు. ఆ కారణంగా దేవతలంతా ఆ రోజు ఆనందోత్సాహాలతో లక్ష్మీదేవి జన్మదిన వేడుకలను జరుపుతారు. తాము చీకట్లలోనుండి వెలుగులోకి వచ్చిన దానికి చిహ్నంగా దీపాలు వెలిగించి, లక్ష్మిని జ్యోతి స్వరూపంగా ఆరాధించటం ప్రారంభించారు. ఆ విధంగా దీపావళి దేవతలు కూడా జరుపుకునే పండుగ అయింది.



ఉత్తమం. అంతేకాకుండా మూడు పోగులు గల వత్తి వేసి మాత్రమే దీపాలు వెలిగించాలి. దీపాలను ముందుగా తులసి కోట దగ్గర వెలిగించాకే వేరేచోట అలంకరించుకోవాలి.

### ఎన్నో కథలు

కార్తీకమాసంలో వచ్చే పండుగలలో చాలా ముఖ్యమైనదే కాక, పండుగలన్నింటిలో ప్రశస్తమైనదిగా, ముఖ్యమైనదిగా చాలా ప్రాంతాల వారు పరిగణించేది దీపావళి. అవనిశిని దీప్తమంతం చేస్తుంది కనుకనే దీనిని దీపావళి అని పిలుస్తారని ముక్తకంఠంతో చెప్పేమాట. అయితే ఈ పండుగ ప్రాముఖ్యం వెనుక ఎన్నో కథలు, కారణాలు ఉన్నాయి.

### నరకాసుర వధ

దీపావళి హిందువుల పండుగ. నరకాసురుని వధించిన రోజే దీపావళి పండుగ అని ప్రజలు చెబుతారు. శ్రీకృష్ణుడు సత్యభామ తోడ్పాటుతో నరకాసురుణ్ణి సంహరించింది చతుర్దశి నాడు కానీ, ఆ సంతోషాన్ని అందరూ వ్యక్తపరిచి వేడుక చేసుకున్నది మాత్రం మరునాడేనట. అదే దీపావళి. నరకాసురవధ అజ్ఞాన నిర్మూలనకు ప్రతీక. నరకుని అంతమొందించి విజ్ఞానజ్యోతిని వెలిగించటం దీపావళి అంతరార్థం అనీ, ఇంట దీపం వెలిగించటంతో పాటు గుండెల్లోనూ, సమాజంలోనూ కూడా ఆ దీపం వెలగాలనీ, అప్పుడే దీపావళి పండుగ నిజమైన సంబరం అవుతుందనీ పెద్దలు మనకు సూచనప్రాయంగా అందించిన సంప్రదాయం. మనకు ఆశ్వయుజ కృష్ణ అమావాస్య, ఉత్తర దేశీయులకు కార్తీక అమావాస్య అయిన దీపావళి రోజున అనేక శుభ సంఘటనలు అన్ని యుగాలలోనూ జరిగాయని ప్రతీతి. వాటి జ్ఞాపకార్థం దీపావళి జరుపుకోవటం ఆనవాయితీ అయిందట.

### సీతారాముల ఆగమనం

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు రావణుని వధించి సీతా సమేతుడై అయోధ్యకు వచ్చిన సందర్భంలో సీతారాములను ఆహ్వానించటానికి పౌరులు నగరాన్ని ఆవునేతి దీపాలతో అలంకరించారట. ఆ దీపాలు వారి మనస్సులలో ఉన్న ఆనందానికి చిహ్నం శ్రీరాముడు లేని రోజులన్నీ తమకు చీకటి అనీ, రాముని ఆగమనం తమ జీవితాలకు వెలుగు నిచ్చిందనీ తెలియపరచటానికే ఆ దీపాలు. ఆ రోజు కార్తీక అమావాస్య అనీ, ఆ సంతోషకర సంఘటనకి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆ రోజు దీపాలు వెలిగించి ఉత్సవం జరుపుకుంటారని దీపావళి పండుగ మూలం త్రేతాయుగం నుండి ఉందని ఒక విశ్వాసం.

### మహావీరుని జన్మదినం

జైనమత ప్రవక్త మహావీరుడు జన్మించింది కూడా దీపావళి రోజే. అందుకే జైనులు దీపావళిని పరమ పవిత్రదినంగా భావిస్తారు. విక్రమాదిత్య చక్రవర్తి 30 లక్షలమంది శకులను హూణులను భరత భూమి నుంచి పారద్రోలిన సమయమూ దీపావళి శుభదినమే. ఆనాటి నుంచే విక్రమార్కశకం ప్రారంభమైంది.

### సిక్కులకూ పవిత్ర దినమే

దీపావళితో సిక్కులకు కూడా అవినాభావ సంబంధం ఉంది. సిక్కుల గురువు గురుగోవింద సింగ్ ను మొఘల్ చక్రవర్తి జహంగీర్ గ్వాలియర్ కోటలో బంధించాడు. కొన్నాళ్ళకు చక్రవర్తి గురుగోవిందసింగ్‌ను మాత్రం విడుదల చేయటానికి నిశ్చయించుకున్నాడు కాని, గురుగోవిందసింగ్ అందుకు ఇష్టపడక, కోటలోని వారందరినీ కూడా తనతో పాటు విడుదల చేయాలని పట్టుపట్టాడు. జహంగీర్ ఆయన మాట మన్నించాడు. ఆ శుభ దినం కూడా దీపావళే. భారతదేశంలో ఉన్న అన్ని సంప్రదాయాలకీ దీపావళితో ఏదో ఒక విధమైన సంబంధం ఉంది. అందరూ దీపావళిని పవిత్ర దినంగా భావించి, వేడుకలు జరుపుకుంటారు.

'దీపం పరబ్రహ్మ స్వరూపమే కాదు సమస్తమైన చీకట్లనూ పోగొడుతుంది. దానివల్లనే అన్నింటినీ సాధించవచ్చు అట్టి సంధ్యా దీపమా నీకు నమస్కారము' అనేది ఒక శ్లోకతాత్పర్యం.

సమస్తమైన చీకట్లనూ అనగా సమస్తమైన జీవకోటికి హాని కలిగించే అజ్ఞానము, పాపము, శోకము, మొదలైన ప్రగతి నిరోధకమైన చీకట్లన్నింటినీ పోగొట్టేది దీప ప్రజ్వలనమే. కంటికి కనిపించే చీకట్లనే కాదు, అజ్ఞానం, దు:ఖం, శోకం, అలసత, రోగము, మాంద్యము, మృత్యువు మొదలైన వాటినన్నింటిని పారద్రోలేదీ ఆ దీపకాంతులే.



దీపావళి రోజు బాణాసంచా మోతలతో ఎంజాయ్ చేయాలనుకుంటారు ఎక్కువమంది. అయితే దానివల్ల వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగి పర్యావరణానికి, మూగజీవులకు హాని జరుగుతుంది. అందువల్ల ఈసారి టపాసులకు 'నో' చెప్పి గ్రీన్ దీపావళికి వెల్‌కమ్ చెప్పండి.











# దీపావళి.. ఇట్ల చెయ్యాలి

**దీపావళి** అంటేనే వెలుగుల పండుగని. అందుకే ఇంటిని, వాకిలిని దీపపు కాంతులతో అలంకరిస్తుంటాం. ఈ క్రమంలో కొందరు రంగురంగుల ఫ్లోరోసెంట్ బల్బ్‌లను పెడుతుంటారు. కానీ వాటివల్ల పెద్దమొత్తంలో కరెంట్ ఖర్చవుతుంది. అలాకాకుండా ఉండాలంటే విద్యుత్ దీపాల చమక్కులకు చెక్ చెప్పి మట్టి ప్రమిదల్లో నూనె పోసి వెలిగించండి. నేచురల్ వెలుగులతో మీ ఇంటిని నింపేయండి. కావాలనుకుంటే.. ఆ దీపాలకు మీ చేతితో రంగులద్ది అందంగా అలంకరించండి. ఇవికాకుండా గోధుమపిండితో, నారింజ తొక్కలతో, కొబ్బరి చిప్పలను ప్రమిదలుగా మలిచి కూడా దీపాలు వెలిగించొచ్చు.

### పచ్చని బహుమతి

ఆత్మీయులకు, మిత్రులకు శుభాకాంక్షలతో పాటు తీపిని అందిస్తాం. ఇంటి ముందు దీపాల్ని వెలిగిస్తాం. ఈ దీపావళి నుంచి ఆ సంప్రదాయాలతో పాటు ఓ మొక్కను బహుమతిగా ఇద్దాం. స్వచ్ఛమైన గాలిని అందించే మొక్కలను, గాలిని శుభ్రపరిచే మొక్కలను ఈసారి గిఫ్ట్‌గా ఇవ్వండి. ఇవికాకుండా జ్యూట్ బ్యాగ్స్, ఖాదీ బట్టలు, సోలార్ పవర్‌తో పనిచేసే గ్యాడ్జెట్‌లను దీపావళి బహుమతులుగా ఇవ్వొచ్చు. పాత న్యూస్‌పేపర్లనే రేపర్స్‌గా గిఫ్ట్ ప్యాక్‌లు చేయండి. పర్యావరణానికి నష్టం కలగకుండా ఈ ఫెస్టివల్‌ని సెలబ్రేట్ చేయండి.

### ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్

వాతావరణానికి ఎలాంటి హాని చేయని, ధ్వని కాలుష్యం లేని గ్లో స్టిక్స్, స్నేక్‌మిక్స్, ఫేక్‌నోట్, ఫ్లవర్ పవర్ వంటి ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ మార్కెట్లో ఉన్నాయి. వీటిని రీసైకిల్ పేపర్స్‌తో తయారుచేస్తున్నారు. ఈ క్రాకర్స్‌తో గ్రీన్ దీపావళికి స్వాగతం చెప్పొచ్చు. రంగు రంగుల బెలూన్లకి గ్లిట్టర్ పూసి మెరిపించేయండి.

### రంగోలీ..

పూర్వం ఇంటిముందు బియ్యం పప్పులతో రంగవల్లులు వేసేవాళ్లు. అలాగైనా పక్షులకు కొంత దాణా దొరుకుతుందని వాళ్లు భావించేవాళ్లు. మళ్లీ ఆ కాలం రావాలని కోరుకుందాం. ఈసారి కెమికల్ కలిపిన రంగవల్లుల బదులు బియ్యం, పప్పులతో నింపి పువ్వులతో ఫినిషింగ్ టచ్ ఇవ్వండి. పువ్వులు ఎండిపోతే ఆ పూలను కూడా తర్వాత రోజు కంపోస్ట్ ఎరువుగా తయారుచేసుకొని మీ గార్డెన్ కోసం ఉపయోగించండి. డెకరేషన్‌లో ప్లాస్టిక్‌ని దరిచేరనీయకుండా కలర్‌ఫుల్ దుపట్టా, చీరలతో ఇంటిని అలంకరించండి.

### బీ కేర్‌ఫుల్

- ఏ పండుగ జరిగినా ప్రశాంతంగానే ముగుస్తుంది. కానీ దీపావళికి మాత్రం ఎక్కడో ఒకచోట ఏదో ఒక చెడు వార్త వినాల్సి వస్తుంది. కాబట్టి ఈ పండుగ పూట జాగ్రత్తగా ఉండండి. చేయాల్సినవి, చేయకూడనివి ఏంటో తెలుసుకోండి.
- ఇంట్లో, ఇంటి దగ్గరలో అస్సలు పటాసులు కాల్చొద్దు.. అలాగే కాల్చే చోట చెట్లు, పచ్చగడ్డి, అంటుకునే వస్తువులు లేకుండా శుభ్రం చూసుకోండి.
- కాలిన గాయాలకు వాడే క్రీములు, ఐ-డ్రాప్స్, ఇన్‌హేలర్స్ కూడా మీతో పాటు ఉంచుకోండి. పొగ కారణంగా వీటి అవసరం కూడా రావొచ్చు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కంపల్సరీ!
- పక్కన ఎప్పుడూ నీళ్లను పెట్టుకోండి. అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే నీళ్లు చల్లడానికి ఉపయోగపడతాయి.
- పాకెట్‌లో ఈ టపాసులను పెట్టుకొని తిరుగొద్దు. అవి ఏ క్షణంలో ఎలాగైనా పేలితే ముప్పు మీకే!
- మెటల్, గ్లాస్ కంటెనయిర్‌లలో టపాకాయలను కాల్చండి.

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition



# చీకటి వెలుగుల రంగేళి.. దీపావళి

**లక్ష్మీపూజలకు ఏర్పాట్లు**

**పూలు, మామిడి తోరణాలతో అలంకరణ**

**కాగజ్‌నగర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దీపావళి అనే సరికి ధమధమ భీకర ధ్వనుల బాణాసంచా ఆర్భాటాలు స్ఫురిస్తాయి. దీపావళి అంటే ఏమిటో గ్రహించినప్పుడే అందం. ఆనందం. దీపం జ్ఞానానికి ప్రతీక.. ఏ శుభకార్యం జరిగినా జ్యోతి ప్రజ్వలనతోనే ప్రారంభిస్తాం. దీపావళి నాటి వెలుగులు జగత్ నంతటిని కాంతిమయం చేస్తాయి. ప్రతీ వ్యక్తి జీవితంలో దీపావళి ఒక మరుపురాణి పండుగ... ఈ రోజు మహిళలు బొమ్మల పండుగగా జరుపుకుంటారు. ఇంట్లో బొమ్మను కొలువును ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాపారుల దీపావళి నాడు లక్ష్మీపూజ చేసి తమ దుకాణాలను ప్రత్యేకంగా అలంకరించుకుంటారు. రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో దుకాణాలు, ఇళ్లను అలంకరించుకుంటారు. దీపావళి అంటే దీపాల వరుస. పటాకులు మోతలు.. కాకరపూల కాంతులు,, భూచక్రాల వెలుగులు.. చిచ్చ బుడ్ల జిలుగులు.. పసందైన పిండివంటలే కాదు.. అల్లరి పిల్లలు.. పిల్లల్లా మారే పెద్దలు.. కేరింతలు.. తుల్లింతలు కలిసిన పండుగ. వెలుగుపూల వేడుక. చీకట్లను పార దోలి వెలుగులను నింపే దివ్వెల పండుగ. దీపావళికి అంతా సిద్ధమైంది.

**మార్కెట్‌లో పండుగ సందడి..**
జిల్లాలో దీపావళి పండుగ సందడి నెలకొంది. దీపావళి పర్వ దినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇక్కడి ప్రాంత వాసులు ఆదివారం జరిపిన కొనుగోళ్లతో వ్యాపార సంస్థలన్నీ కళకళలాడాయి. ప్రధానంగా స్టేషనరీ దుకాణాలు, వస్త్ర దుకాణాలు, పూజా సామాగ్రి విక్రయ కేంద్రాలు సందడిగా నిలిచాయి. ఉదయం నుంచి కొనుగోలుదారులతో బిజీగా కనిపించాయి. వ్యాపారులు ఉదయం వేళలో ముహుర్తం ప్రకారం స్టేషనరీ దుకాణాలకు వెళ్లి తమకు అవసరమైన ఖాతా బుక్‌లను కొనుగోలు చేశారు. లక్ష్మీపూజలను ఘనంగా నిర్వహించేందుకు గాను అవసరమైన పూజా సామాగ్రిని కొనుగోలు చేశారు. పట్టణంలోని వస్త్ర దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఏ షాపులో చూసినా సందడే సందడి కనిపించింది. రోడ్లపై పూల దుకాణాలు, ప్రమిదల విక్రయ కేంద్రాలు వెలిశాయి. వ్యాపారులు తమ తమ సంస్థలను రంగులతో తీర్చిదిద్దుతూ విద్యుత్ బల్బులను అమర్చారు. విద్యుత్ దీపాలతో విరజిమ్మే వెలుగులతో గృహాలు కళకళలాడుతున్నాయి. ఇక టపాసుల విక్రయ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో ఆసిఫాబాద్ పట్టణంలోని టపాసుల దుకాణాల వద్ద సందడి నెలకొన్నది. ఇక బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. మార్కెట్‌లో ఎక్కడ చూసి దీపావళి శోభ సంతరించుకుంది. పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చిన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతు న్నారు. పండుగను సంతోషమయం చేసుకోవాలని సూచించారు.



# పండుగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- వంజీరి, బెండార గ్రామాల్లో విషాద ఛాయలు
- న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ఆందోళన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. దీపావళి పండుగ వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సమయంలో‘ కారు’ చీకట్లోకి నెట్టింది. రహదారి ప్రమాదం రూపంలో ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తన అక్కతో పాటు మేనల్లుడు, మేనకోడళ్లను తన ఇంటికి తీసుకు వెళ్లె మామా సైతం రోడ్డు ప్రమాదంలోనే విగత జీవులయ్యాడు. కూతురు, మనుమడు, మనుమరాలు పండుగకు వస్తుందని ఎదురు చూసిన అమ్మమ్మ, తాతయ్యలకు పుట్టెడు దుఖఃం మిగిల్చింది. ప్రమాదం నుంచి బయట పడ్డ చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీపావళి పండుగ వేళ ఊహించని రీతిలో ముగ్గురు చని పోవడం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. భార్య, కుమారుడు, మావమరిది మృతి చెందిన విషయాన్ని భర్త జీర్ణించుకోలేకపోతున్నాడు. దీపావళి వెలుగుల మధ్య గడపాల్సిన ఆ రెండు కుటుంబాలను అంధకారంలోకి నెట్టింది.

**మోతుగూడ గ్రామ శివారులో..**
ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి 363పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కకక్కడే మృతి చెందారు. వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన చంద్రి జగన్ దీపావళి పండుగ వేడుకల కోసం కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో ఉంటున్న తన అక్క డోంగ్రే అనసూయతో పాటు మేనల్లుడు, మేనకోడలు డోంగ్రె ప్రజ్ఞాశీల్, డోంగ్రె హరికలను ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై తీసుకుని బెండారకు బయలుదేరాడు. మోతుగూడ ఫ్లైఓవర్ వద్ద వెనుక నుంచి వేగంగా మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న చంద్రి



జగన్(27), తన అక్క డోంగ్రె అనసూయ(32), మేనల్లుడు డోంగ్రె ప్రజ్ఞాశీల్(6) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో డోంగ్రె హరికకు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలకు తరలించారు.

**ఆందోళనకు దిగిన మృతుల కుటుంబసభ్యులు..**
రోడ్డు ప్రమాదంలో తమ కుటుంబీకులు మృతి చెందారని విషయాన్ని తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృత దేహలను సంఘటన స్థలం నుంచి తరలించకుండ జాతీయరహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపుల వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి పోయాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐ బాలజీ వరప్రసాద్ ఆందోళన కారులకు నచ్చ చెప్పి బాదితులకు న్యాయం జరిగేలా చుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. సంఘటన స్థలంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకొవాలని పోలీసులను సూచించారు. అనంతరం మృతదేహలను ఆసిఫాబాద్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆసిఫాబాద్ ఆసుపత్రి మార్చురీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**వంజిరిలో విషాద ఛాయలు...**
కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి 363పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలం వంజిరిలో గ్రామానికి చెందిన అనసూయ(32), ప్రజాశీల్(6) మృతి చెందడంతో వంజిరిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో అనసూయ సోదరుడు జగన్(27) కూడా మృతి చెందారు. అనసూయ భర్త సిద్దార్థ క్రెయిన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పండుగ పూట తన తల్లిగారి ఇంటికి సోదరుడితో బయలు దేరి వెళ్లిన అరగంట వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం అంతా జీర్ణించుకోలేక పోతున్నారు. అప్పటి వరకు చూసిన అనసూయను తలుచుకుంటూ గ్రామస్థులు, బంధువులు రోదించారు. ఇటీవలే ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైందని, పండుగ తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పిందని, ఇప్పుడు కానిరాని లోకాలకు పోవడం బాధకరమైన విషయమని పలువురు తెలిపారు.

## మనస్తాపానికి గుర్రై..
# హాస్టల్ వార్డెన్ ఆత్మహత్యాయత్నం

**లక్షెట్టిపేట, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మనస్తాపానికి గుర్రైన ఓ హస్టల్ వార్డెన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మంచిర్యాల జిల్లా ఖానాయార్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఖానాయర్‌కు చెందిన రాజగోపాల్ రావు లక్సెట్టిపేట పట్టణంలో ఓ బాలుర హాస్టల్కు వార్డెన్‌గా పని చేస్తున్నాడు. గతేడాది వసతి గృహంలో 109 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 250కు పెరిగింది. వసతిగృహ నిర్వహణ కోసం తాను పెట్టిన డబ్బులు వచ్చే అవకాశం లేకపోవడంతో అధికారులను పలుమార్లు అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గుర్రై రాజగోపాల్ రావు యాసిడ్ తాగి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డాడు.కుటుంబ సభ్యుల ఆయనను నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## వరంగల్ జిల్లా అథ్లెటిక్స్
# అసోసియేషన్ అధ్యక్షుడిగా సీఐ కిషన్

**బెల్లంపల్లి, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**



వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తీకి చెందిన సీనియర్ నేషనల్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు, మడికొండ సీఐ పులియాల కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, నిస్వార్థ సేవను గుర్తించి సభ్యులు సీఐ కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వరంగల్ జిల్లాలోని హనుమకొండలో తెలంగాణ అథ్లెటి క్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి అధ్యక్ష తన ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సీఐ పులి యాల కిషన్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తమ వం తు కృషి చేస్తామని, జిల్లాలోని అథ్లెటిక్ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు మెరు గైన శిక్షణ, వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పులియాల కిషన్ ను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, రాష్ట్ర సభ్యుడు పగిడిపాటి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమన్, నాగరాజులు ఘనంగా సన్మానించారు. కాగా బెల్లంపల్లికి చెందిన కిషన్ పోలీస్ అధికారిగా విధులు నిర్వహిస్తూనే వరంగల్ జిల్లాలో నిర్వహించిన అనేక క్రీడా పోటీల్లో క్రీడాకారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

## ఆదివాసీ సాంస్కృతి
# సాంప్రదాయం విభిన్నమైనది

**భీంపూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ సాంస్కృతి సాంప్రదాయం విభిన్నమైనది ఎంత ఆధునిక వస్తున్నా తరాల ఆచారం అలా ప్రవహిస్తుందంటే మంచి విషయం. రేపటి సాంస్కృతికి వారదులం, వారసులం మేము అంటూ చెప్పకనే చెపుతున్నాడు. భీంపూర్ మండలంలోని వాడేగమ గ్రామానికి చెందిన కాత్లే ఉమేష్ 3 ఏళ్ళ బాలుడు గుస్సాడీ వేషధారణలో అక్కడికి చూడ వచ్చిన అందరిని ఆకట్టుకున్నాడు.



# బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం

**ఖానాపూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావాలని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాన్సన్ నాయక్‌కు దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను వారు కలిశారు. నవంబర్ 1 నుండి 6 తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు.



# బలమైన వ్యవసాయ చట్టాలు కావాలి

**జన్నారం, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దేశంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు బలమైన వ్యవసాయ చట్టాలు కావాలని తెలంగాణ రైతు సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్ల లింగన్న కోరారు. ఆదివారం జన్నారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగ విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఆయన కోరారు.



# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

## అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.రాజలింగు




**ఆదిలాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.రాజలింగు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఆదిలాబాద్ రామ్ లీలా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద ఆదివారం షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సందర్భంగా లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు.క్రాకర్స్ షాప్స్ ప్రమాదకరమైనవని పనుల్లో పెట్టుకున్న సంబంధిత షాప్ యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.అనుకొని సంఘటన జరిగితే బాలలకు ఇబ్బందులు వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వన్ టౌన్ ఎస్ఐ సయ్యద్ ఇసాక్,క్రాకర్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్,షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, ఫీల్డ్ సూపర్వైజర్లు కిరణ్, సౌజన్య, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ అనిల్,కేస్ వర్కర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**నిర్మల్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దీపావళి పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు, అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి విజయం సాధించిన ప్రతీకగా దీపావళిని జరుపుకుంటామని, ప్రతి ఇంటిలో ఆనందం, వెలుగు నిండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సమృద్ధి కలగాలని కోరుకుంటూ, టపాసులు పేల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు.

## దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోండి

### ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్



**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఆనందం, వెలుగులతో సురక్షితంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులు తల్లిదండ్రుల పర్యవేక్షణలో కాల్చాలని సూచించారు. ప్రమాదకరమైన బాణసంచా వాడకూడదని, ప్రజల భద్రత కోసం పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారని, శాంతి, సౌహార్ద్ర వాతావరణంలో పండుగ జరుపుకోవాలనిఆకాంక్షించారు.

## కుభీర్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్



**కుభీర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
కుభీర్ మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సం.. రాలలోపు ద్విచక్ర వాహనాలు నడిపిన వారికీ నిబంధనల ప్రకారం ఫైన్ నిర్వహించినట్లు అలాగే వారి పేరెంట్స్‌ను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం 18 సం.రాల లోపు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు.

## జూదం ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**ఆదిలాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్సై బి.సునిల్ కుమార్ తెలిపారు. ఎస్సైవివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రాం సమీపంలోని అమన్ స్విమ్మింగ్ పూల్ వద్ద ఆడుతున్న జూదగాళ్ల నుంచి రూ.23,400 నగదు, ఎనిమిది సేల్ ఫోన్‌లు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## వెడ్మ రాము వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ఏదూలాపాడ్ గ్రామంలో ఈనెల 26న జరిగే అమరజీవి వెడ్మ రాము 38వ వర్ధంతికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెడ్మ రాము చేసిన సేవలు, పోరాటాలను కొనియాడుతూ, గిరిజన హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## తాండూర్‌లో అండర్-14,17 జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు



**తాండూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14,17 చెస్ బాలురు, బాలికల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఆదివారం తాండూర్ మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాల పాఠశాలలకు చెందిన 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడా కారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ జోనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని క్రీడా సమాఖ్య ప్రతినిధి, ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎండీ యాకూబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్, పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, పాఠశాల అకాడమీ డైరెక్టర్ సౌమ్య, ప్రినిపాల్ సరోజిని, పోటీల చెస్ ఆర్బిటర్స్ సమ్మయ్య, ఆకాష్, కార్తీక్, క్రీడల అబ్జర్వర్ పాశం శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శులు బాలకృష్ణ, రాజు, తారకేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజమహమ్మద్, వహీదాబేగం, విశాల, వామన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## కుభేర లక్ష్మి సహస్ర కుంకుమార్చన పూజలు



**తాండూర్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రం భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ధన త్రయోదశి పురస్కరించుకొని కుభేర లక్ష్మి సహస్ర కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు సూర్య భాస్కర కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు నవీన్ శర్మ, వినోద్ పంతులు 108 సుహాసినిలతో కుంకుమార్చన నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులను సమర్పించుకున్నారు. పూజలలో పాల్గొన్న మహిళలకు ఆలయ కమిటీ నిర్వాహకులు సౌకర్యాలను కల్పించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మద్దికుంట రామచందర్, రాజయ్య, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా ప్రజలకు దీపావళి, దండారి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

**ఆదిలాబాద్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
దీపావళి, దండారి పండుగల సందర్భంగా ప్రజలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి వెలుగుల పండుగగా ప్రతి ఇంటిలో ఆనందం, ఐకమత్యం, సంతోషం నిండాలని ఆకాంక్షించారు. ప్రజలు పండుగలను సురక్షితంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గిరిజనుల సాంప్రదాయ పండుగ అయిన దండారి గుస్సాడి సందర్భంగా గిరిజన సోదరులు, కళాకారులకు కలెక్టర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. గుస్సాడి నాట్యం గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని పేర్కొన్నారు. ఈ విలువైన వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ పండుగలను ఐకమత్యం, సోదర భావంతో జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రతీ పంటకు బోనస్ ఇవ్వాలి

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)**
రైతు పండించిన ప్రతి పంటకు బోనస్ ఇవ్వాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజల ప్రధాన పంటలైన పత్తి,సోయా,మొక్క జొన్న, శనగ,వేరు శనగ పంటలకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. మొక్క జొన్నతో పాటు సోయాబిన్ , పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. కిషన్ కపాస్ యాప్ ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. యాప్‌ను ఇప్పుడే అమలు చేయకుండా క్రమ క్రమంగా మొదలు పెట్టాలని సూచించారు. అనేక మంది రైతుల వద్ద సెల్‌ఫోన్లు లేవని, ఉన్న నెట్‌వర్క్ ఉండదని పేర్కొన్నారు. ఒకటి, రెండు సంవత్సరాలు పాత పద్ధతి ద్వారానే పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు ఎవరుకూడా దళారులకు పంట అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## యోధులారా వందనం..
# అమరులారా వందనం..!

ఒంటిపై ఖాకీ యూనిఫాం.. చేతిలో లాఠీ.. భుజానికి తుపాకీ.. మాటల్లో కర్కషం.. చూడ్డానికి కరుకుగా కనిపించే పోలీసులకూ మనసుంటుంది. అందులో ప్రేమ, ఆప్యాయతలకూ చోటుంటుంది.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, ఖాకీలు కొన్నిసార్లు పాశాన హృదయుల్లా ప్రవర్తించాల్సి వస్తుంది.. లేకపోతే అసాంఘిక శక్తులు పెట్రేగిపోయి.. ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్ధకంగా మారుతుంది.. రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అసవులు బాసిన పోలీసు త్యాగధనులను స్మరించుకుందాం.

- పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి..
- వారి త్యాగఫలమే నేటి ప్రశాంత జీవనం
- సంచలనం సృష్టించిన నాటి అల్లంపల్లి ఘటన
- రేపు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం






**భారత్, చైనా సరిహద్దులో లడక్‌లోని అక్సమ్‌చిన్ వద్ద 1959 అక్టోబర్ 21న విపరీతమైన చలిలో పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశంలోకి చొచ్చుకొచ్చారు.. పదిమంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు చైనా సైన్యంతో పోరాడి వీరమరణం పొందారు.. 1960 జనవరి 9న అన్ని రాష్ట్రాల పోలీసు అధికారులు సమావేశమై అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవంగా పాటించాలని తీర్మానించారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది అక్టోబర్ 21న అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ.. ప్రతి ఒక్కరూ సహాయం కోరేది పోలీసులనే. ప్రజలు, దేశం కోసం అమరులైన పోలీసుల సేవలను స్మరించుకోవడం వారికి నిజమైన నివాళి.**

### నాటి ఘటనలు హృదయ విదారకం... రాష్ట్రంలో సంచలనం అల్లంపల్లి ఘటన... రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం













**ముథోల్, అక్టోబర్ 19 (ప్రభాత సమాచారం)** పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే నక్సల్స్ సంచరించే ప్రదేశామని పెద్దమనుషులు చెబుతుండేవారు. జిల్లాలో ఉద్యోగం చేయాలంటే దూర ప్రాంతాల వారు అమ్మో అనే వారు. అప్పుడు ఈ ప్రాంతంలో పీపుల్స్ వార్ నక్సలైట్ల ప్రాభల్యం అధికంగా ఉండేది. ఇక్కడి దట్టమైన అడవులు వారికి స్థావరాలుగా నిలిచేది. పోలీసులు అనుక్షణంగా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాల్సిన రోజులవి. తమ పట్టు పెంచుకునేందుకు నక్సల్స్ అనువైన ఈ ప్రాంతాన్ని ఎంచుకునేవారు. వారికి అడ్డుకట్ట వేసేందుకు ప్రాణాలను లెక్క చేయకుండా అడవిని జల్లెడ పడుతూ ఖాకీలు ముందుకు పోయేవారు. నక్సలైట్లకు పోలీసులకు మధ్య ఎన్నో సందర్భాల్లో ఎదురుకాల్పులు జరిగేవి. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొట్టమొదటి ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల కు భారీ ప్రాణనష్టం వాటిల్లింది. ఆ తర్వాత మరికొన్ని సంఘటనలు జరిగాయి. విధి నిర్వహణలో ఖాకీలు ప్రాణాలు కోల్పోయారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ప్రభాత సమాచారం' కథనం..

**పోలీసుల సంస్మరణ దినోత్సవం ఎందుకంటే..**

యేటా ఈరోజు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపడం వెనుక ఒక కారణముంది. 1959 అక్టోబర్ 21న లడక్ ప్రాంతంలో సీఆర్‌పీఎస్ ఎస్సై కరణ్‌సింగ్ పది మంది జవాన్లతో విధులు నిర్వహిస్తుండగా చైనా సాయుధ దళాలు మాటువేసి కాల్పులు జరిపాయి. అక్కడ మన వాళ్లు వీరోచితంగా పోరాడినా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. సముద్ర మట్టానికి 16వేల అడుగుల ఎత్తులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ నేపథ్యంలో అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.

**1989లో కడెం మండలంలో..**

రెండో సంఘటన అప్పుడు కడెం మండలంలో ఉండి ఇప్పుడు ఖానాపూర్‌లో కలిసిన సింగాపూర్ గ్రామ శివారులో జరిగింది. 1989 ఫిబ్రవరి 1న ఖానాపూర్ నుండి సింగాపూర్ వైపునకు వెళ్తున్న పోలీసు జీపును నక్సల్స్ మందుపాతరతో పేల్చేశారు. ఈ ఘటనలో ఒక ఎస్సై సహా ఏడుగురు పోలీసులు అమరులయ్యారు. రహదారిపై మందుపాతరతో ఇంత మంది పోలీసులను హతమార్చడం అప్పట్లో సంచలనం రేపింది. పోలీసులు అటు వైపు రావాలన్న ప్రణాళికతో ముందుగా ఆ ప్రాంతంలో నక్సల్స్ ఒక లారీని కాల్చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లే క్రమంలో మందు పాతర ఉచ్చుకు అసువులు బాసారు.

**1999 డిసెంబర్‌లో..**

1999 డిసెంబర్ 2న నక్సల్స్ నుండి పోలీసులకు మరో నష్టం వాటిల్లింది. ఖానాపూర్ సమీపంలో రహదారిపైనే ఈ సంఘటన జరిగింది. కడెం నుండి ఖానాపూర్ వెళ్తున్న పోలీసు జీపును నక్సల్స్ తర్లపాడ్ సమీపంలో మందుపాతరలతో పేల్చేశారు. ఈ ఘటనలో సీఐ ప్రాణాలతో బయటపడగా ఎస్సై సింగం మల్లేశ్, కానిస్టేబుల్ పున్నంచంద్ ప్రాణాలు కోల్పోయారు.

**ఆ మూడు నిర్మల్ జిల్లాలోనే..**

రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన మందుపాతరలతో పోలీసులను హతమార్చిన సంఘటనలు (అద్దాల తిమ్మాపూర్, సింగాపూర్, తర్లపాడ్ ) నిర్మల్ జిల్లాలో ఉన్నాయి. ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. కడెం, ఖానాపూర్ మండలాల్లో జరిగిన మూడు ఘటనల్లో మొత్తం 19 మంది పోలీసులు అమరులయ్యారు. వివిధ సందర్భాల్లో పోలీసులకు నక్సల్స్‌కు మధ్య ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో మావోయిస్టులకు ప్రాణనష్టం జరిగింది. కానీ పోలీసులు చనిపోయిన సంఘటనలు మాత్రం పైమూడు.

**ఖానాపూర్‌లో అమరుల స్థూపం..**


పోలీసులు ప్రాణాలు కోల్పోయిన మూడు ముఖ్యమైన సంఘటనలు ఖానాపూర్ సర్కిల్ పరిధిలోనే జరిగాయి. ఈ నేథప్యంలో అక్కడి సర్కిల్ కార్యాలయంలో అమరవీరుల కోసం పెద్ద స్థూపాన్ని నిర్మించారు. యేటా అక్టోబర్ 21న అక్కడ అమర పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారు.

**రాష్ట్రంలోనే సంచలనం ఈ ఘటనలు..**

ఉమ్మడి రాష్ట్రంలో తొలి ఎన్‌కౌంటర్ 1987 ఆగస్టు 18న జరిగింది. కడెం మండలం అల్లంపల్లి సమీపంలోని అద్దాల తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలో నక్సలైట్లు పోలీసులను హతమార్చారు. ఆ ఎన్‌కౌంటర్ గందం రామస్వామి అలియాస్ సాగర్ నేతృత్వంలో జరిగింది. ఆ ఘటనలో ఇద్దరు ఎస్సైలు సహా 10 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఈ సంఘటన అనంతరం అప్పటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు అల్లంపల్లిని సందర్శించి నక్సలిజం పెరిగేందుకు కారణాలు తెలుసుకుని ఈ ప్రాంత యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

**రేపు ఉమ్మడి జిల్లాలో అమరుల దినోత్సవం..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 15 నుండి 21 వరకు పలు పోలీసు స్టేషన్‌లలో ఆయా జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ పోలీస్ హౌస్, క్రీడా పోటీలను నిర్వహించారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.







# దీపాల కళ

ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు.. వాటి మీద అందమైన పూలతో అలంకరణ.. చుట్టూరా వెలుగులు విరజిమ్ముతూ దీపాలు.. ఇవన్నీ దీపావళి పండుగకి వెలుగుల వెల్‌కం చెప్తాయి.

దీపావళి డెకరేషన్ ఐటమ్స్ మార్కెట్‌లో బోలెడు వెరైటీలు దొరుకుతున్నాయి. అసలైన దీపాల్లా కనిపించే వీటితో పండుగ కళ ఇన్‌స్టంట్‌గా వచ్చేస్తుంది.









